Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.2

December 2024



5లో

## క్రిస్మస్‌లో క్రీస్తును అనుకరిద్దాం

ఎడిటోరియల్

# గొప్ప త్యాగం

స్కాటిష్ మిషనరీ, అన్వేషకుడు, వైద్యుడు, వేదాంతి, సువార్తికుడు, ఉపదేశకుడు, బహుభాషా పండితుడు, జంతుశాస్త్రవేత్త, దాస్యంలో మగ్గుచున్న వారికి విముక్తి ప్రదాత, ముప్పై మూడు సంవత్సరాలు చీకటి ఖండమైన ఆఫ్రికాలో జీవించి, ఆఫ్రికాను సువార్తతో వెలిగించిన వాడు డేవిడ్ లివింగ్‌స్టోన్. తాను సువార్తను ప్రకటించే క్రమంలో అనేక బాధల్ని భరించాడు. 29,000 మైళ్ళు నడిచాడు. అతని భార్య పరిచర్య ప్రారంభంలోనే మరణించింది. తన స్కాటిష్ సోదరులనుంచి వ్యతిరేకతను ఎదుర్కొన్నాడు. ఈ మిషనరీ ఒకసారి ఇలా అంటాడు, "నా జీవితంలో ఎక్కువ భాగం ఆఫ్రికాలో గడిపినందుకు నేను చేసిన త్యాగం గూర్చి ప్రజలు మాట్లాడుతూ ఉంటారు. మనం ఎప్పటికీ తీర్చుకోలేని గొప్ప రుణంలో దేవునికి కొంత భాగం మాత్రమే తిరిగి చెల్లించి దాన్ని త్యాగం అని పిలవవచ్చా? ఇది ఖచ్చితంగా త్యాగం కాదు. మన కోసం తనను తాను అర్పించుకోవడానికి తన పరలోక సింహాసనాన్ని విడిచి పెట్టిన యేసుక్రీస్తు చేసిన గొప్ప త్యాగాన్ని గుర్తు చేసుకున్నప్పుడు దానికి మరేవి సాటిరావు"

త్యాగం అంటే విలువైనవి వదులుకోవడం, త్యజించడం, విడిచిపెట్టడం అని అర్థం. చాలాసార్లు తల్లిదండ్రులు తమ పిల్లల కోసం, సైనికులు దేశం కోసం, వ్యక్తులు తమ లక్ష్యాల్ని సాధించడం కోసం త్యాగాలు చేస్తారు. ఇవి తాత్కాలికంగా, వారి బాధ్యతలను బట్టి గాని, భయంతో, స్వార్థంతో, తమ పరిధులను బట్టి, ఈలోక సంబంధమైనవిగా ఉంటాయి. అయితే అసలైన గొప్ప త్యాగం అంటే ఏంటి? సమస్త మానవాళిని ప్రేమించి, వారి భౌతిక, ఆత్మీయ క్షేమం కోసం 'అత్యంత విలువైన వాటిని' నిస్వార్థంగా విడిచిపెడితే అంత గొప్ప త్యాగం చేసినట్లు. అది వ్యక్తుల గొప్పతనాన్ని బట్టి, వారు చూపించిన త్యాగాన్ని బట్టి కూడా దానికి విలువ ఉంటుంది. ఈ లోకంలో ఇలాంటి అత్యంత విలువైన గొప్ప త్యాగం చేసినవారెవరైనా ఉన్నారా? అంటే ఖచ్చితంగా దైవ మానవుడైన యేసుక్రీస్తు ప్రభువు జీవితాన్ని జ్ఞాపకం చేసుకోవాల్సిందే.

నిత్యుడు, సర్వాధికారి, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞాని, సర్వవ్యాపి, సర్వసృష్టి కర్తయైన యేసుక్రీస్తు ప్రభువు పాపులైన మానవాళి రక్షణ కొరకు, వారికి నిత్యజీవాన్ని ఇవ్వడం కోసం ఈ భూమి మీద ఒక శిశువుగా జన్మించడం అన్ని త్యాగాలకంటే అత్యున్నతమైన త్యాగం. "ఆయన దేవుని స్వరూపము గలవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసుకొనెను" (ఫిలిప్పీ 2:6-7). ఆయన శరీరధారణలో ఐదు మార్పులు ఉన్నాయి. నివాస స్థలంలో, అంతస్తులో, మహిమలో, పోలికలో, స్థాయిలో మార్పు ఉన్నాయి. ఆయన నశించిన మానవాళి పట్ల అగాపే ప్రేమను చూపించాడు. పరలోక రాజ్య సువార్తను ప్రకటించాడు. రక్షణ, నిత్యజీవం ఇవ్వడానికి కఠినమైన శ్రమలు, హింసలు, అవమానం, హేళన భరించి, సిలువ మరణం పొంది, సమాధి చేయబడి మూడవ దినాన మృత్యుంజయుడై తిరిగి లేచాడు. అందుకనే ఈ లోకంలో మానవులు చేసిన ఎలాంటి త్యాగాలతోనైనా క్రీస్తు త్యాగాన్ని పోల్చలేము, పోల్చకూడదు.

క్రీస్తు మనసును కలిగి ఉన్నప్పుడే మనం కూడా పరిచర్యలో త్యాగాలు చేయడానికి సిద్ధపడతాం. క్రీస్తు మనసును కలిగి ఉండాలంటే వ్యర్థమైన వాటిని విసర్జించి, ఆయనతో సన్నిహితంగా ఉంచే ఆయన వాక్యాన్ని, ప్రార్థనను హత్తుకోవాలి. అప్పుడు క్రీస్తు ప్రేమ, త్యాగం మనకు అర్థమై క్రియారూపంలోకి వస్తుంది.

డేవిడ్ లివింగ్‌స్టోన్ 1852లో ఆఫ్రికా అంతటా ట్రెక్కింగ్ ప్రారంభించినప్పుడు, తనతో 73 పుస్తకాలను తీసుకెళ్ళాడు. అతను 300 మైళ్ళు వెళ్ళిన తర్వాత కొన్ని పుస్తకాలను విసిరేయాల్సి వచ్చింది. ఎందుకంటే అడవి గుండా వాటిని తీసుకు వెళ్ళడం సాధ్యం కాలేదు. అతను మరింత అడవిలోకి వెళ్ళినప్పుడు మిగిలిన పుస్తకాలను కూడా విసిరేశాడు. చివరికి అతని దగ్గర ఒకే ఒక పుస్తకం- బైబిల్ మాత్రమే ఉంది. దీనిని అతను విసిరి వేయలేదు. దాన్ని హత్తుకున్నాడు. దేవుని మనస్సు కలిగి ఆఫ్రికా ప్రజల మధ్య త్యాగపూరితంగా జీవిస్తూ, క్రీస్తు మాదిరిని, ప్రేమను చూపిస్తూ, చీకటి ఖండాన్ని ప్రభువు కోసం గెలిచాడు.

ఆదిమ అపొస్తలులు, మిషనరీస్ కూడా క్రీస్తు చూపిన మార్గంలో నడిచారు. తమ సుఖాలను, సంపదను లక్ష్యపెట్టక త్యాగపూరితంగా జీవిస్తూ నశించినవారి రక్షణ కొరకు సువార్తను అందించారు. చివరకు తమ ప్రాణాల్ని కూడా అర్పించారు. మనం కూడా క్రీస్తు మాదిరి అనుసరించాలి. నశించిపోయే విద్యార్థుల రక్షణ కోసం మన సమయాన్ని, ధనాన్ని, నిద్రను, సుఖాల్ని, సాంఘిక, వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయాలి. త్యాగం లేకపోతే ఫలితం ఉండదు. దేవునికి, దేవుని పనికి ఆటంకంగా ఉండే వాటిని వదిలి వేయాలి. వ్యక్తిగత జీవిత అభివృద్ధికోసం ఎంతో కష్టపడతాం, అనేక త్యాగాలు చేస్తాం. తన అమూల్యమైన ప్రాణమిచ్చి మనల్ని నిత్య నరకం నుంచి రక్షించిన దేవుని కోసం ఏమైనా త్యాగం చేశామా? పరీక్షించుకుందాం.

క్రిస్మస్ శుభాకాంక్షలతో...

**- పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్

# విద్యార్థి జ్వాల

Vol. 31, No. 2. December 2024
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCPRICTION:
The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**

CONTACT:
The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



మనలను రక్షించడానికి యేసుక్రీస్తు ప్రభువు ఎంత కిందికి దిగివచ్చారో, మన ఆరాధనలో మనం ఆయనను అంత ఉన్నతంగా హెచ్చించాలి లేదా పైకి ఎత్తాలి.

విద్యార్థి జ్వాల పాఠకులందరికీ

## క్రిస్మస్ శుభాకాంక్షలు

## లోపలి పేజీల్లో...

- గొప్పత్యాగం - 2
- ఇదే చివరి అవకాశం - 3
- క్రిస్మస్‌లో క్రీస్తును అనుకరిద్దాం - 5
- అర్థవంతమైన క్రిస్మస్ - 9
- పండుగలెందుకు? - 12
- దేవుడే దిగి వచ్చిన వేళ - 14
- నీతిమంతునిగా ప్రకటించడం - 15
- కన్నీరు ఉందా? - 21
- క్రీస్తు మనసు - సహవాసంలో ఐక్యత - 22
- సుఖవలయాన్ని వదిలి వెళ్ళడం - 23
- అవతల ఒడ్డు - 28
- చల్లా చల్లని గాలి తెమ్మెర - 30
- సర్వోన్నతుడు- సశరీరుడయ్యే - 30
- మేమూ వస్తాం - 32

హార్ట్ టు హార్ట్



# ఇదే చివరి అవకాశం

"కొందరు చర్చ్ గంట ధ్వని వినిపించేంత దూరంలో జీవించాలని కోరుకొంటారు. నేను నరకానికి గజంలోపే 'రక్షించే దుకాణం' నడపాలని అనుకొంటున్నాను" అనే సిటి స్టడ్ మాటలు మానవ జీవితంలో సువార్తకున్న ప్రాధాన్యతను అత్యంత బిగ్గరగా, స్పష్టంగా, తీవ్రంగా తెలియజేస్తున్నాయి. ప్రాధాన్యతను అర్థం చేసుకొన్న మనం జీవితంలో ఇదే చివరి నెలగా భావించి, మన సంపద, సమయం, సామర్థ్యాలను సంపూర్ణంగా వాడుకొందాం. మన స్నేహితుల రక్షణ కోసం చేసే ప్రయత్నాలలో క్రిస్మస్ సందేశాన్నిచ్చే ప్రసంగీకులు కూడా చాలా శ్రద్ధతో, సిద్ధపాటుతో దేవుని వర్తమానంతో రావాలని ప్రార్థనలు కొనసాగించాలి. వారి ఆత్మీయత, వారి శారీరక ఆరోగ్యం కూడా ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. ఈ ప్రత్యేకమైన సీజన్‌లో శ్రద్ధతో, శుద్ధ మనసుతో సువార్తను అందిద్దాం.

ఇందులో భాగంగా ప్రసంగీకులు ఇదే చివరి అవకాశంగా భావించి, చెప్పే తమకు, వినే విద్యార్థులకు కూడా చివరి అవకాశమని గ్రహించి ఎంతో శ్రద్ధతో, తీవ్రతతో, పరిశుద్ధాత్ముని శక్తితో ప్రకటించాలి.

ప్రోగ్రామ్ నిర్వహించే వారు కూడా ప్రసంగీకులతో సమానమైన పాత్ర పోషించాలి. చాలాసార్లు ప్రసంగీకుల కంటే ఎక్కువ భారాన్ని మోయాల్సి వస్తుంది. విద్యార్థులను ముందుగా ఆహ్వానించి, ఆహ్వానించిన వారికి ప్రేమతో మళ్ళీ గుర్తుచేసి సమయానికి వచ్చేటట్లు చూడాలి. ఎక్కువ సార్లు ప్రేమతో జ్ఞాపకం చేయడం వలన మన ప్రోగ్రామ్ ప్రాధాన్యత వాళ్ళకు అర్థమవుతుంది. క్రిస్మస్ కోసం కాకపోయినా మన ప్రేమను కాదనలేక వచ్చే విధంగా ఉండాలి. దీని పట్ల మనకు ఎంతో శ్రద్ధ అవసరం. శ్రద్ధలో భాగంగా చక్కని పాటలు, సమయానికి సందర్భమైన స్కిట్స్, వ్యవహారిక భాషలో కార్యక్రమాన్ని నడిపించడం ముఖ్యమైనవి.

ఎంతో సమయాన్ని, సంపదను, సామర్థ్యాలను వెచ్చించి అందిస్తున్న సువార్త ద్వారా సంపూర్ణ ప్రయోజనం కలగాలంటే ఫాలోఅప్ కూడా చాలా ప్రాముఖ్యమని మనకు తెలుసు. తెలిసిన ఈ విషయాన్ని శ్రద్ధతో పాటించి నిత్యత్వానికి బాటలు వేద్దాం. నిత్యుడగు తండ్రి హృదయంలో సంతోషం పుట్టించి, విద్యార్థుల జీవితాలను నిత్య సంతోషంతో నింపుదాం. నరకం నుండి తప్పిద్దాం. ఆధునిక సిటి స్టడ్‌లా దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చుదాం. ఇదే చివరి అవకాశం.

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



# క్రిస్మస్‌లో క్రీస్తును అనుకరిద్దాం

ఫిలిప్పీలోని స్థానిక సంఘంలో వ్యక్తిగత గౌరవం, వ్యక్తిగత హక్కులు, వ్యక్తిగత పేరు ప్రతిష్టల కోసం యుద్ధం జరుగుతుంది. వీరు వీటికోసం అల మటించిపోతూ తగ్గించుకోవడం అవమానంగా భావిస్తూ, ఇతరుల కంటే తమను తాము ఎక్కువగా హెచ్చించుకొంటూ స్థానిక సంఘంలో విభేదాలకు, గ్రూపిజానికి కారణమయ్యారు. అయితే పౌలు వారిని పవిత్రమైన ప్రేమనే బంధంలో ఐక్యం చేయాలని కోరుకొంటూ, దాని కోసం వారిని క్రీస్తు యొక్క శరీరధారణ, క్రీస్తు పొందిన అవమానం దగ్గరకు తీసుకొని వస్తున్నాడు. వారిలో వినయం గల మనస్సును కలిగించేందుకు మానవుడిగా మారడంలో క్రీస్తు యొక్క వినయం గురించి మాట్లాడుతూ అలాంటి మనస్సు కలిగియుండాలని వారిని, మన లను కోరుతున్నాడు.

క్రీస్తు శరీరధారణ అనేది కేవలం వేదాంతపరమైన అంశం మాత్రమే కాకుండా మన జీవితాలను నిర్దేశించే, ప్రభావితం చేసే నైతికమైన అంశాల ను కూడా మనకు బోధిస్తుంది గనుక ఈ క్రిస్మస్ సమయంలో యేసుక్రీస్తు శరీరధారణ నుండి మన జీవితాలను ప్రభావితం చేసే అంశాలను నేర్చుకోవడానికి ప్రయత్నిద్దాం.

### నేపథ్యం

ఫిలిప్పీ 2:1-4 వచనాలలో మనం చూస్తే స్వంత మహిమను వెంటాడుతూ, ఇతరుల కంటే తమను తాము అధికులునుగా భావిస్తూ, తన స్వంత ప్రయోజనాలను ఇతరుల ప్రయోజనాల కంటే ప్రాముఖ్యంగా భావించే అహంకార మనసు కలిగి, వినయం లేని, వినయం అనే సుగుణాన్ని అసహ్యించుకొనే, తృణీకరించిన ఫిలిప్పీ సంఘస్తుల గురించి చూస్తాము.

ఫిలిప్పీ 2:5-8లో పౌలు తన పాఠకులలో వినయం లేదా దీనత్వంను పెంపొందించడానికి నిజమైన, పరిపూర్ణమైన వినయాన్ని, విధేయతను అత్యున్నతమైన రీతిలో ప్రదర్శించిన యేసుక్రీస్తు యొక్క శరీరధారణ వైపు వారి మనసులను మళ్ళిస్తున్నాడు. ఇక్కడ పౌలు క్రీస్తు శరీరధారణ సంఘటనను వినయానికి ఒక అంతిమమైన మాదిరిగా చూపిస్తున్నాడు.

ఫిలిప్పీ 2:5-11 అనేది అద్భుతమైన కీర్తన. శరీరధారిగా మారడంలో ఆయన యొక్క వినయాన్ని, సిలువ మరణం పొందడంలో ఆయన చూపిన విధేయతను అద్భుతంగా వివరిస్తుంది.

### క్రీస్తు అత్యున్నత స్థానం, నిస్వార్థమైన ఎంపిక (6వ)

"ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని ఎంచుకొనలేదు గానీ..."

పౌలు పాఠకులను 6వ వచనంలో నిత్యత్వ భూతకాలానికి తీసుకొని వెళ్తున్నాడు. పర లోకములో, నిత్యత్వ భూత కాలములో యేసుక్రీస్తు దేవుని స్వభావము కలిగినవాడు. ఆది నుండి ఆయన దైవ స్వభావము కలిగినవాడు. సంక్షిప్తంగా చెప్పాలి అంటే ఆయన నిగూఢమైన అస్తిత్వంలో సంపూర్ణమైన దైవ స్వభావము, ఆవశ్యకమైన దైవిక గుణ లక్షణాల ను కలిగి యున్నాడు. ఈ దైవత్వం అనేది ఆయన

అప్పటికే కలిగియున్నదే గానీ భవిష్యత్తులో ఆయన సంపాదించుకొనేది కాదు.

అటువంటి దైవిక స్వభావం కలిగిన ఆయన శరీరధారణకు ముందు ఒక ఎంపిక చేశాడు. ఆయన దేవునితో సమానుడు కాబట్టి దైవత్వంకు ఉండే మహిమలు, ఆధిక్యతలన్నిటిని అనుభవిస్తున్న ఆయన, ఆ సమానత్వాన్ని, తాను ఏదో పొందడానికి లేదా తన యొక్క స్వార్థం కోసం కాకుండా ఇతరుల కోసం ఇచ్చివేశాడు. ఆయన తన దైవిక ప్రత్యేకాధికారాలను, గౌరవాన్ని, మహిమను తన సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోకూడదనే ఒక నిస్వార్థమైన ఎంపిక చేశాడు. దేవునిగా తనకున్న హక్కులను ఆయన గట్టిగా బిగించి పట్టుకోలేదు గానీ దానికి బదులుగా తండ్రి చిత్తానికి విధేయత చూపించడాన్ని ఎంచుకొన్నాడు.

దైవత్వం కలిగిన కుమారుడు, దేవునితో తనకున్న సమానత్వాన్ని విమోచన కార్యము, బాధ, మరణం నుండి తప్పించుకోవడానికి ఒక సాకుగా పరిగణించలేదు. శరీరధారణ అనేది యేసుక్రీస్తు యొక్క నిస్వార్థతతో ప్రారంభమవుతుంది.

## క్రీస్తు అంగీకరించిన హీనమైన స్థానము (7వ)

"మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతాను రిక్తునిగా చేసుకొనెను"

ఇక్కడ ఆయన దేవుని స్వరూపాన్ని, దైవత్వాన్ని లేదా దైవిక లక్షణాలను ఖాళీ చేసుకోలేదు. ఇతరుల ప్రయోజనాల కోసం తన యొక్క ప్రయోజనాలను, హక్కులను, ఆధిక్యతలను విడిచిపెట్టడానికి ఇష్టపడ్డాడు. తనను తాను రిక్తునిగా చేసుకోవడం ద్వారా, సిలువ మరణమగునంతగా తనను తాను తగ్గించుకోవడం ద్వారా దేవుని యొక్క లక్షణాన్ని యేసుక్రీస్తు ప్రత్యక్షపరచాడని గోర్డన్ డి ఫీ ప్రముఖ క్రైస్తవ వేదాంతి అభిప్రాయపడతాడు.

మనుష్యుల పోలికగా పుట్టి, బానిస స్వరూపమును, మానవ స్వభావాన్ని ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసుకొన్నాడు. ఆయన ధనవంతుడై యుండియు మీరు తన దారిద్రము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను (2 కొరింథీ 8:9). "రిక్తునిగా చేసుకోవడం అనేది కొత్త, తక్కువ స్థాయిని అంగీకరించడాన్ని సూచిస్తుంది. సార్వభౌమాధికారి

**క్రిస్మస్ అంటే మనల్ని మనం ఉపేక్షించుకోవడానికి, తగ్గించుకోవడానికి అవకాశాలను వెతుక్కోవడం.**

యైన దేవుడైయుండి బానిస స్వరూపమును ధరించి తనను తాను రిక్తునిగా చేసుకోవడము ఎంత అవమానం, ఎంత వినయం.

ఇక్కడ మూడు పదాలు ఆయన యొక్క స్వీయ అవమానము గూర్చి వివరిస్తాయి. 1. బానిస స్వరూపాన్ని తీసుకొన్నాడు 2.మనుష్యుల పోలికలో చేయబడ్డాడు 3. ఆకారమందు మనుష్యుడిగా కనబడ్డాడు. మోట్గెర్ అనే భక్తుడు చెప్పినట్లు "ఆయన ఏ విషయంలో తనను తాను ఖాళీ చేసుకున్నాడు? అని కాదు, ఆయన దేనికి తనను తాను ఖాళీ చేసుకున్నాడు?" అనేదే ఇక్కడ ప్రశ్న అని అంటాడు. "ఆయన బానిస స్వరూపాన్ని తీసుకోవడం ద్వారా రిక్తునిగా చేసుకొన్నాడు గానీ దైవ స్వరూపాన్ని కోల్పోవడం ద్వారా కాదు" అని ఆగస్టీన్ అనే భక్తుడు రాస్తాడు. క్రీస్తు యొక్క మనసు తనను తాను త్యజించుకొనే మనస్సు. ఆయన తన ప్రకాశవంతమైన మహిమ వస్త్రాలను విడిచిపెట్టి మానవత్వం అనే మురికి వస్రాలను ధరించాడు. యేసుక్రీస్తు బిరుదుల కోసం, గౌరవం కోసం దురాశ కలిగినవాడు కాదు. ఆయన ప్రపంచ వైభవాన్ని, మహిమను హీనముగా చూశాడు. క్రీస్తు మన కోసము తగ్గించుకోవడములో, అవమానాన్ని అనుభవించడంలో సంతృప్తి చెందాడు. పాపాత్ములైన ప్రజల కోసం ఆయన తనను తాను తగ్గించుకొన్నాడు, అవమానానికి అప్పగించుకొన్నాడు. "దేవదూతలు పురుగులుగా మారడం కంటే క్రీస్తు మానవుడిగా మారడం ఎక్కువ అవమానమైన చర్య" అని థామస్ వాట్సన్ అనే భక్తుడు అంటాడు.

ఆయన బానిస అయ్యాడు. "ఆయన దేవుని స్వరూపాన్ని బానిస స్వరూపంలో ప్రదర్శించాడని" యఫ్.యఫ్. బ్రూస్ అనే భక్తుడు రాస్తాడు. రోమా సామ్రాజ్యంలో బానిసకు ఎలాంటి హక్కులు ఉండవు. బానిస అంటే కొనే, అమ్మే ఒక ఆస్తి మాత్రమే. దేనిమీద కూడా అతనికి హక్కు ఉండదు. తన జీవితం లేదా ప్రాణం మీద కూడా అతనికి హక్కు ఉండదు. ఇతర ప్రజలలాగా అతనికి ఎటువంటి వారసత్వ హక్కులు కూడా ఉండవు. క్రీస్తు బానిసలా ఉన్నాడు.

ఆయన అన్ని హక్కులు, భద్రతలను తన నుండి తొలగించుకొన్నాడు. ఆయన పాలస్తీనాలోని దీన, పేదరిక జీవితం కోసము పరలోకపు ఐశ్వర్యాలను, విశిష్ఠ అధికారాలు, పరలోకపు మహిమ, ఆధిక్యతల ను విడిచిపెట్టాడు. బహుశా దీనికి సరిగ్గా సరిపోయే చిత్రము యోహాను సువార్త 13వ అధ్యాయంలో చూడవచ్చు. యేసు తనను తాను బానిస స్థానంలో పెట్టుకొని, ధూళితో నిండిన శిష్యుల పాదాలను కడగడం. మేడ గదిలో రాజ వైభవాన్ని ఎలా పక్కన పెట్టాడో శరీరధారిగా మారినప్పుడు తన పై వస్త్రాల ను ప్రక్కన పెట్టి ఒక తువాలును తీసుకొని, ఒక బానిస లాగా తన నడుముకు కట్టుకొన్నాడు.

### క్రీస్తు భరించిన ఘోరమైన అవమానం (8వ)

"మరియు ఆయన ఆకారమందు మనుష్యుడిగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను."

ఈ వాక్యము ఆయన శరీరధారణను, సమస్తమైన భూసంబంధమైన జీవితం గురించి మాట్లాడుతుంది. శిశువుగా, చిన్నపిల్లవాడిగా, బాలుడిగా, యువకుడిగా, పురుషునిగా ఆయన ఎలా జీవించాడో అనే దాని గురించి మాట్లాడుతుంది. "ఆయనలో తన మాదిరి ని చూడలేని ఏజ్ గ్రూప్" ఏదీ లేదని వార్‌ఫీల్డ్ అనే భక్తుని అభిప్రాయం.

ఆయనలో ప్రత్యేకమైన దైవిక స్థితికి సంబంధించిన చిహ్నాలు అనగా, ప్రకాశం/వెలుగు లేదు. పేదరికం, బలహీనత, ప్రజావ్యతిరేకత, మానవ తిరస్కరణ మాత్రమే ఉన్నాయి. ఆయన నిజమైన మానవత్వం దైవత్వాన్ని కప్పిపెట్టింది. ఆ ముసుగు క్రింద ఉన్న దైవత్వాన్ని మానవ నేత్రము చూడలేక పోయింది. ప్రజలు కేవలం ఆయన యొక్క మానవ స్వభావము, బలహీనత అనే ముసుగును మాత్రమే చూడగలిగారు.

తర్వాత భాగంలో యేసుక్రీస్తు తీర్మానంతో కూడిన విధేయతను మనము చూడగలం. తండ్రికి సంపూర్ణంగా విధేయత చూపించాలనే నిర్ణయము తీసుకొన్న శరీరధారియైన యేసు గూర్చి పౌలు రాస్తున్నాడు. ఆయన తన్నుతాను తగ్గించుకొన్నాడు. తన్నుతాను తక్కువవానిగా లేదా అల్పమైన వానిగా చేసుకొన్నాడు. అవమానానికి, సిగ్గుపరచబడడానికి తన్నుతాను అప్పగించుకొన్నాడు.



ఈ వాక్య భాగము, సంక్షిప్తంగా, "మునుపటి బోధకు (2:1-5) ఆధారాన్ని అందిస్తుంది." ఫిలిప్పీలోని స్థానిక చర్చిలో వ్యక్తిగత గౌరవం, వ్యక్తిగత హక్కులు, వ్యక్తిగత ఆధిక్యత కోసం పోరాటం. మరోవైపు, యేసు జీవితం స్వీయాన్ని లోబరచడం, స్వీయాన్ని త్యజించడం, స్వీయ త్యాగము అనే ల క్షణాల ద్వారా ప్రకాశిస్తుంది.

యేసు మరణమగునంతగా విధేయత చూపడం ద్వారా తన్నుతాను తగ్గించుకొన్నాడని పౌలు రాస్తున్నాడు. ఆయన వినయం సొంత అజెండా లేదా తప్పుడు భక్తిలో కాదు, గానీ విధేయతలో వ్యక్తమైంది. ఆయన ఎవరికి విధేయత చూపాడంటే? తండ్రికి (ఫిలిప్పీ2:9). ఎంత వరకు విధేయత చూపాడంటే? మరణాన్ని అంగీకరించేటంత వరకు విధేయత చూపాడు. ఆయన సాధారణమైన మరణం పొందలేదు గానీ ఎంతో హీనమైన ఘోరమైన, భయంకరమైన సిలువ మరణాన్ని పొందాడు. ఈ మరణం అనేది ఆయన అవమానంలో అత్యంత హీనమైనది. ఆయన తన పాపాల కోసం చనిపోలేదు గానీ పాపాత్ములైన మనుష్యుల పాపాల కోసం మరణించాడు. సంక్షిప్తంగా, సిలువపై మరణం "అత్యంత అవమానకరమైన దశ".

### క్రిస్మస్‌లో క్రీస్తును అనుకరిద్దాం

1. క్రిస్మస్ అంటే మనల్ని మనం ఉపేక్షించు కోవడానికి, తగ్గించుకోవడానికి అవకాశాలను వెతుక్కోవడం.
2. ఇతరుల కోసం మనం బానిస పాత్ర తీసుకోవడానికి కూడా వెనుతీయకూడదనే సత్యాన్ని మనకు నేర్పిస్తుంది.
3. దేవుడైన యేసు, తాను ప్రేమించిన పాపాత్ము లైన మానవులకు బానిస అయ్యాడు. దేవుని కుటుంబంలోని ప్రతి ఒక్కరికి మనము దాసులమే.

**"ప్రేమ ప్రతి మనిషిని యేసుక్రీస్తుకు మాత్రమే కాదు, మొత్తం దేవుని కుటుంబానికి సేవకునిగా చేస్తుంది" - డ్వైట్ పెంతెకోస్త్**

4. మనము వినయాన్ని మన జీవితాలలో అనుసరించాలంటే యేసుక్రీస్తు అనే అద్దము ఎదుట ప్రతిరోజూ నిలబడాలి.
5. కమిటీస్‌లో కుర్చీల కోసం ప్రాకులాడుతూ, పదవులను గట్టిగా పట్టుకొని వేలాడే మనకు పరలోకపు సింహాసనాన్ని, ఆధిక్యతలను విడిచిపెట్టి శిష్యుల కాళ్ళు కడిగిన యేసు యొక్క వినయం మాదిరి కాదా?
6. స్వీయాన్ని విచ్ఛిన్నము చేసుకోవడం లేదా త్యజించడమే క్రైస్తవుని మహిమ.
7. క్రీస్తు మన పోలికలో చేయబడ్డాడు కాబట్టి మనం ఆయన పోలికలోనికి మార్చబడడానికి ప్రయాసపడదాం.
8. క్రీస్తులాగే మనము కూడా ఈ లోక గౌరవాలను, ఘనతలను, వైభవాలను హీనముగా చూసేటట్లు అభ్యాసం చేద్దాం.
9. తనను తాను తగ్గించుకొన్న దేవుడు-తనను తాను హెచ్చించుకొంటున్న మానవుడు. వినయుడైన రక్షకుడు - అహంకారియైన పాపి చిత్రాన్ని ఊహించలేము.
10. నిస్వార్థం, విధేయత విషయంలో యేసు యొక్క అత్యున్నత ఉదాహరణ నిస్వార్థ జీవితం, విధేయతతో కూడిన జీవితాలను జీవించడానికి విశ్వాసులను పిలుస్తుంది.
11. స్వీయాన్ని ఉపేక్షించుకోవడం, తగ్గించుకోవడం అనేది మన సంస్కృతిలో ఒక ప్రసిద్ధ అంశమేమీ కాదు, కానీ క్రీస్తు మనసులో క్రైస్తవ ఎదుగుదలకు ఇదే ప్రారంభ స్థానం.
12. ఇతరుల సంతోషంలో తన సంతోషాన్ని వెతుక్కొని, స్వీయాన్ని త్యజించి వినయంతో నిండిన క్రీస్తు మనస్సు కలిగిన సహవాసంలో అనైక్యత మనుగడ లేదు.
13. "దేవుని కుమారుడు అత్యున్నతమైన ఎత్తు నుండి క్రిందికి దిగి వచ్చాడు కాబట్టి ఏమీ కానీ, ధూళిలాంటి మనము గర్వముతో హెచ్చించుకోవడం అసమంజసమైనది" అని కెల్విన్ భక్తుడు అభిప్రాయపడతాడు.
14. ప్రతి ఒక్కరూ తగ్గించుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, ప్రతి ఒక్కరూ తన తోటివారిని తనకంటే ఉన్నతమైన స్థానంలో ఉంచాలని కోరుకున్నప్పుడు, పార్టీలు, విభేదాలు, విభజనలు అన్నీ కూడా తొలగిపోతాయి.
15. హక్కుల కోసం సహవాసం ముక్కలైనా ఫర్వాలేదని స్వంత ఘనత, మహిమ కోసం, స్వార్థంతో నిండిన మన జీవితాలకు తన హక్కులను, ఘనతను, పరలోక మహిమను పక్కన పెట్టి అందరికీ దాసుడైన యేసు మాదిరి ఒక సవాలు కాదా?
16. "ప్రేమ ప్రతి మనిషిని యేసుక్రీస్తుకు మాత్రమే కాదు, మొత్తం దేవుని కుటుంబానికి సేవకునిగా చేస్తుంది అని డ్వైట్ పెంతెకోస్త్" అనే భక్తుడు రాస్తాడు.
17. క్రీస్తు త్యాగము, వినయం అర్థం చేసుకొంటే, ఇతరులకు త్యాగపూరితముగా సేవచేయడంలో మన హక్కులన్నిటిని వదులుకోవడం, మన ప్రాణాలను పెట్టడం కంటే తక్కువైనది మనము ఏదైనా చేయగలమా? క్రీస్తు వినయంతో కూడిన శరీరధారణ, సిలువ పక్కన నిలబడిన వ్యక్తి అహంకారిగా ఎలా ఉండగలడు?
18. క్రీస్తు లాంటి మనస్సు కలిగియున్న వ్యక్తి తన హక్కులను ప్రాధాన్యత కలిగినవాటిగా పరిగణించడు గానీ ఇతరుల క్షేమము కోసము, మంచి కోసము వాటిని పక్కన పెట్టడంలో ఆనందిస్తాడు.
19. మనలను రక్షించడానికి ఆయన ఎంత కిందికి దిగివచ్చాడో, మన ఆరాధనలో మనం ఆయనను అంత ఉన్నతంగా హెచ్చించాలి, పైకి ఎత్తాలి.
20. మానవాళి మీద తన ప్రేమను, వినయము, విధేయత ద్వారా వ్యక్తపరిచిన యేసుక్రీస్తు మాదిరిని ఈ క్రిస్మస్ సమయంలో మరలా జ్ఞాపకం చేసుకొందాం.

– డా. పి. నాసరయ్య, వైజాగ్



ప్రత్యేకం

# అర్థవంతమైన క్రిస్మస్

క్రిస్మస్ ప్రపంచమంతా జరుపుకొనే పండుగ. యేసుక్రీస్తు నరావతారిగా ఈ లోకానికి విచ్చేసిన పర్వదినంగా మనం జరుపుకొంటాము. క్రిస్మస్ అనే పదము క్రైస్ట్‌మాస్ అనే పదము నుంచి వచ్చింది, ఇది కృతజ్ఞతలు (యూకరిస్ట్) చెల్లించే పండుగతో సమానం. క్రైస్ట్-మాస్ అంటే యేసును ఆరాధించడం.

## క్రిస్మస్ పండుగ చరిత్ర

చరిత్రలో మొట్టమొదటి సారిగా క్రిస్మస్ క్రీ.శ. 336 డిసెంబర్ 25వ తేదీ రోమన్ చక్రవర్తి కాన్స్టంటైన్ పరిపాలనలో జరిగింది. ఎందుకంటే క్రీ.శ 312లో కాన్స్టంటైన్ క్రైస్తవుడిగా మారాడు. దీనిని ఫీస్ట్ ఆఫ్ నేటివిటీగా పిలిచారు. ఈ పండుగ సాంప్రదాయం క్రీ.శ 432 నాటికి ఈజిప్ట్‌కు వ్యాపించింది. ఆరవ శతాబ్దము చివరికి ఈ పండుగ ఇంగ్లాండ్‌కు వ్యాపించింది. ఆ తరువాత క్రిస్మస్ ఉత్సవాలు స్కాన్డినేవియా అంతా వ్యాపించాయి.

కాంటర్‌బరీకి చెందిన సెయింట్ అగస్టీన్ ఇంగ్లాండ్‌లో క్రైస్తవ్యాన్ని పరిచయం చేయడం ద్వారా ఇంగ్లాండ్‌లో ఎక్కువ ప్రాంతాలు క్రిస్మస్ పండుగ జరుపుకోవడానికి కారకుడయ్యాడు. రోమ్‌కి చెందిన పోప్ గ్రెగరీ ఆఫ్ ది గ్రేట్ సెయింట్ అగస్టీన్‌ను ఇంగ్లాండ్ పంపాడు. సంఘము గ్రెగేరియన్ కేలండర్‌ను ఉపయోగించుకొంది. పాశ్చాత్య దేశాలు డిసెంబర్ 25ను క్రిస్మస్‌గా జరుపుకొనే వారు. బ్రిటన్, పశ్చిమ యూరప్ 25 డిసెంబర్‌న క్రిస్మస్ పండుగ ఆచరిస్తూ ప్రపంచమంతటికి దానిని తీసుకొని వెళ్ళారు.

## క్రిస్మస్ తేది

యేసుక్రీస్తు నిజముగానే డిసెంబర్ 25నే జన్మించాడా అంటే దానికి చారిత్రాత్మక ఆధారాలు లేవు. బైబిల్ తేదీని గూర్చి నిశ్శబ్దంగా ఉంది. సాధారణంగా ఎక్కువ మంది క్రైస్తవులు డిసెంబర్ 25న క్రిస్మస్ జరుపుకొంటారు. కానీ అమెరికన్ సంఘం (ఈస్టర్న్ చర్చ్) జనవరి 6న క్రిస్మస్ జరుపుకొంటారు. ఈస్టర్న్ చర్చ్‌లో ఒక విభాగము జనవరి 17న క్రిస్మస్ జరుపుకొంటారు. అయితే క్యాథలిక్ సంఘం, ప్రొటెస్టెంట్ సంఘం (వెస్టర్న్ చర్చ్) మరియు ఈస్టర్న్ చర్చ్‌లో కొన్నిశాఖలు కూడా డిసెంబర్ 25న క్రిస్మస్ జరుపుకొంటారు.

క్రిస్మస్ డిసెంబర్ 25నే జరుపుకోవాలని చాలా సిద్ధాంతాలు, సాంప్రదాయాలు ఉన్నాయి. మరియను గాబ్రియేల్ దూత దర్శించిన దినము మార్చి 25 అనే ఒక సాంప్రదాయం ఉంది. అప్పటి నుంచి లెక్క గట్టి 9 నెలలు అంటే డిసెంబర్ 25 యేసు క్రీస్తు పుట్టిన దినముగా నిర్ణయించారు.

హనుక్ అనే యూదుల పండుగ కిస్లేవు మాసం 25వ తారీఖున జరుపుకొనే వారు. యూదులు చెరకు వెళ్లి చాలా కాలము ఆరాధనకు, అర్పణలకు,

బలులు అర్పించడానికి నోచుకోని వారై ఆ తరువాత ఆలయాన్ని పున:ప్రతిష్ఠించిన దినముగా డిసెంబర్ 25ను భావిస్తారు. యేసు యూదుడు కాబట్టి సంఘము లేక క్రైస్తవులు ఈ తేదీని నిర్ణయించి ఉంటారు అనేది మరొక భావన.

అయన మరణం నుంచి లెక్క వేసి అయన జనన తేదీని లెక్కించారనే భావన ఒకటి ఉంది. ఏది ఏమైనప్పటికీ ఆయన ఈ లోకములో ఒక రోజున జన్మించాడు. దానిని గుర్తు చేసుకోవడంలో తప్పులేదు. అందుకే మనం నవంబరు నెల నుంచి జనవరి వరకు మన విద్యార్థులకు క్రిస్మస్ వేడుకలు జరిపి సువార్తను అందిస్తాము. వాటిని సెమీ క్రిస్మస్, ప్రీ క్రిస్మస్ అని పిలవాల్సిన అవసరం లేదు. అవి కూడా క్రిస్మస్‌లే. ఎందుకంటే మనకు సరైన క్రిస్మస్ తేదీ తెలియదు కాబట్టి.

## క్రిస్మస్ పండుగను వ్యతిరేకించే వారు

చర్చ్ ఆఫ్ క్రైస్ట్, యెహోవా సాక్షులు, క్వేకర్స్ (కేవలం ఆత్మీయ అనుభవాలకు, మన:సాక్షి ప్రకారము నడుచుకోవడానికి, నైతికతకు మాత్రమే విలువనిచ్చి, ఆచారాలను, సాంప్రదాయాలను, ఉత్సవాలను, వేడుకలను నిషేధించే శాఖ)క్రిస్మస్ పండుగను జరుపుకోరు. దానిని ఒక అన్య జనుల ఆచారముగా లేక పండుగగా పరిగణిస్తారు. ఎందుకంటే, క్రీ.శ. 274లో రోమ్‌లో అరౌలియన్ అనే చక్రవర్తి సూర్యుడ్ని ఆరాధించడానికి వింటర్ సొలిస్టిన్ అనే పండుగ జరపడానికి డిసెంబర్ 25 తారీఖును ఎన్నుకొన్నాడు. అయితే రోమా చక్రవర్తి కాన్‌స్టంటైన్ క్రీ.శ 336లో డిసెంబర్ 25న నీతి సూర్యుని ఆరాధించాలనే ఉద్దేశముతో క్రీస్తు పుట్టిన రోజును డిసెంబర్ 25గా నిర్ణయించాడు.

## పండుగల పట్ల యేసు వైఖరి

యేసు తల్లిదండ్రులతో కలసి పస్కాపండుగను ఆచరించడానికి యెరూషలేముకు వెళ్ళాడు. ఆయన యెరూషలేములో మూడు రోజులు ఉండి దేవాలయంలోని బోధకులతో చర్చించడం మనం వాక్యములో గమనిస్తాము.ఆయన సిలువలో చనిపోయే ముందు పస్కా పండుగను ఆచరించడం కూడా వాక్యములో మనం చూస్తాము.ఈ రెండు పండుగలు ఇశ్రాయేలు ప్రజల చరిత్రలో వారి దాస్యము నుంచి విడుదల, వారి జీవితాలలో దేవుని కార్యాలను సూచిస్తాయి, దేవుని అద్భుతాల ను జ్ఞాపకము చేసుకొని ఆయనకు కృతజ్ఞతలు చెల్లించడమే ఆ పండుగల ఉద్దేశము. ఎస్తేరు గ్రంథములో హామాను పన్నిన కుట్ర, మరణ శాసనము నుంచి యూదులు విడుదల పొందినందుకు పూరీము అనే పండుగ జరుపుకోవడాన్ని మనం బైబిల్‌లో చూస్తాము.

## మనము క్రిస్మస్ జరుపుకోవచ్చా?

మనము తప్పకుండా క్రిస్మస్ చేసుకోవచ్చు. ఎందుకంటే దేవుడు ఈ భూమి మీదకి వచ్చిన పర్వ దినాన్ని పండుగగా జరుపుకోవడంలో కృతజ్ఞత ఇమిడి ఉంది. యేసు మనలను రక్షించ డానికి దాసుని స్వరూపం ధరించుకొని రిక్తుడై సిలువ మరణాన్ని పొందాడు.మనకు నిత్యజీవాన్ని ఇవ్వడానికి ఆయన పరలోకం విడిచి మానవునిగా మనతో ఐక్యమవ్వడానికి ఇష్టపడ్డాడు. దీనిని గుర్తు చేసుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం.

యేసు పుట్టినప్పుడు అయన పుట్టుక ఉద్దేశాన్ని, ఆనవాలును గొర్రెల కాపరులకు దేవదూత తెలియ చేయడం, దేవదూత జ్ఞానులను తిరుగు ప్రయాణంలో నడిపించడం, యేసు పుట్టినప్పుడు దూతలు ఉత్సాహముతో గాన ప్రతిగానాలు చేయడం మొదలగు విషయాలను బట్టి నిస్సందేహంగా మనం క్రిస్మస్‌ను జరుపుకోవచ్చని తెలియజేస్తున్నాయి. ఆయన మరణాన్ని మనం గుర్తు చేసుకొంటున్నప్పుడు, ఆయన జననాన్ని ఎందుకు గుర్తుచేసుకోకూడదు?

నేను ఆయన పుట్టుక జరుపుకోను అంటే ఆయన ఈ లోకానికి వచ్చిన విషయాన్ని నీవు గుర్తించడం లేదన్న మాట.ఆయన పుట్టుకకు లేని ప్రాధాన్యత మరణానికి ఎందుకు? ఆయన సిలువ మీదే కాదు జగతికి పునాది వేయక ముందే వధించ బడ్డాడు. అది సిలువ మీద అమలు చేయబడిందంతే.

క్రిస్మస్‌ని వ్యతిరేకించే వారు, నిషేధించే వారు క్రిస్మస్ పట్ల సరైన అవగాహన లేని, తప్పుడు క్రైస్తవ సిద్ధాంతాలను కలిగి ఉన్నవారు తమ పుట్టిన రోజులు, వారి పిల్లల పుట్టిన రోజులు, వారి అధికారుల పుట్టిన రోజులు ఘనముగా జరుపు కొంటారు గానీ, సృష్టికర్త నరావతారిగా వచ్చినదినాన్ని జ్ఞాపకం చేసుకొని ఆయనకు కృతజ్ఞతలు చెల్లించరు.



## క్రిస్మస్‌లో ఉండే ఆచారాలు

క్రిస్మస్‌లో ఉండే కేరల్స్, క్రిస్మస్ ట్రీ, శాంతా క్లాజ్ ఇవి సింబల్స్ మాత్రమే. ఇవి విగ్రహాలు కాదు. ఏదైనా వస్తువుని పూజిస్తే అది మనకు విగ్రహం అవుతుంది. నిజానికి సున్నతి, సిలువ (రోమా ప్రభుత్వ శిక్షకు సూచన) అన్యుల ఆచారాలు. యూదుల్లో మరణ శిక్షను, ఉరి తీయడం ద్వారా గానీ లేక రాళ్ళతో కొట్టడం ద్వారా గానీ విధిస్తారు. దేవుడు వాటిని తీసుకొని పవిత్ర పరిచారు. యూదులకు నిబంధన గురుతుగా సున్నతి ఇవ్వబడింది. క్రొత్త నిబంధనలో ఉన్న మనము రక్షణ పొందాము అనేదానికి బాప్తీస్మము ఒక గురుతుగా ఉంది. అంతరంగంలో జరిగిన మార్పుకి బహిరంగ సూచన. అలాగే రొట్టె, ద్రాక్షారసము ఆయన శరీరానికి, రక్తానికి సూచనగా ఉన్నాయి.నేటికీ మన మందిరాలపై ఉండే సిలువ అది క్రైస్తవ ప్రార్థనా మందిరమని సూచిస్తుంది. కానీ వీటిల్లో దేనినైనా పూజిస్తే అది విగ్రహారాధన అవుతుంది. కేరల్స్ దేవుని దూతలు సువర్తమానాన్ని తెలియచేయడం, ఆయనను స్తుతించడం, క్రిస్మస్ చెట్టు పచ్చదనానికి, పచ్చదనము ఆశీర్వాదానికి సూచన. కీర్తన 1లో దేవుని వాక్యాన్ని ధ్యానించేవాడు ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చే చెట్టువలె ఉంటాడని పోల్చడం జరిగింది, యేసు శపించిన చెట్టు ఎండి పోయింది. శాంతాక్లాజ్ ఇతరులకు ప్రేమను పంచి ఇచ్చే దానికి సూచనగా ఉన్నాడు. కానీ వీటికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఇవి లేకపోతే క్రిస్టమస్ లేదు అనే భావన తప్పుడు భావన.

## క్రిస్మస్ వెనుక ఉన్న విషాదం

యేసు పుట్టిన రోజు మనకు ఎంతో సంతోషాన్ని కలిగించేదైనప్పటికి దాని నేపథ్యం ఎంతో విషాదం గా, అవమానకరంగా, భయముతో కూడుకొన్నదిగా ఉంది. హేరోదు అనేకమంది మగపిల్లలను చంపడం, మరియ పెళ్లి కాకుండా గర్భవతి కావడం, హేరోదుకు భయపడి యోసేపు, మరియ ఐగుప్తుకు శరణార్థులుగా వెళ్ళిపోవడం లాంటి సంఘటనలు, మనకు రక్షణ తీసుకొని రావడానికి ఇతరులు ఎంత శ్రమ పడ్డారో తెలియజేస్తాయి.

రక్షణ ఈ లోకానికి రాకుండా సాతానుడు అడ్డు కోవడానికి చేసే ప్రయత్నాలు, అవమానపరచే ప్రయత్నాలు, భయపెట్టే ప్రయత్నాలుగా మనము చూస్తాము. సువార్త ప్రకటించడానికి, మనుష్యులు రక్షణ పొందకుండా ఆటంకపరచడానికి నేటికి అడ్డుకోవడం, అవమానపరచడం, భయపెట్టడము అనే కారణాలు మనకు కనబడతాయి. వాటిని అధిగమించడానికి దేవుడు అప్పుడు వారికి సహాయము చేశాడు. ఇప్పుడు మనకు కూడా సహాయం చేస్తాడు.

## క్రిస్మస్ అంటే ఇవ్వడం

క్రిస్మస్ మానవాళి పట్ల దేవునికున్న ప్రేమను తెలియచేస్తుంది. దేవుడు తన సొంత కుమారుని ఈ లోకానికి పంపి మానవాళి రక్షణ కొరకు సిలువమీద బలిగా అర్పించడం ఆయన త్యాగాన్ని తెలియ చేస్తుంది. మరియ తన గర్భాన్ని యేసు జన్మించడానికి ఇచ్చింది. బెత్లెహేములోని యజమానుడు తన పశువుల తొట్టెను యేసుకిచ్చాడు. జ్ఞానులు యేసుకు కానుకలు సమర్పించారు, అరిమతయియ యోసేపు తన సమాధిని యేసుకు ఇచ్చాడు.ఈ క్రిస్టమస్ లో మనము దేవునికి, ఇతరులకి ఇచ్చే వారంగా ఉండాలని దేవుని ఆశ. ఈ శుభసందర్భములో మన స్నేహితులకు, బంధువులకు మనము ఇచ్చే బహుమతులన్నిటికంటే విలువైన బహుమతి రక్షణ. ఈ బహుమతి ఇవ్వాలంటే సువార్త ప్రకటించాలి, ఆయన ఈలోకానికి ఎందుకు వచ్చాడో వివరించే సందర్భం ఇంతకంటే ఏముంటుంది.

## క్రిస్మస్ సందేశం

దూతలు తీసుకొచ్చిన క్రిస్మస్ సందేశంలో రక్షణ, సంతోషం, సమాధానం ఉన్నాయి. కాబట్టి ఈ విషయాలను అందరికి తెలియజేయాలి. క్రిస్మస్ అంటే ఇవ్వడం కాబట్టి పేదలను జ్ఞాపకము చేసుకొని వారి అవసరాలలో పాల్గొని వారితో మనము కలిసి పండుగ జరుపుకోవడం దేవునికి ఇంకా ఎక్కువ ఇష్టం. కుటుంబముతో సంతోషముగా గడుపుతూ అర్థవంతంగా క్రిస్మస్ చేసుకొని మనము అనేక మందికి ఆశీర్వాదకరంగా ఉందాం.

– జి. జెర్మియా ప్రసాద్, స్టాఫ్, నంద్యాల

ప్రత్యేకం

# పండుగలెందుకు?

అప్పుడే డిసెంబర్ నెల వచ్చేసింది. డిసెంబర్ అనగానే మనకు గుర్తుకు వచ్చేది క్రిస్మస్ పండుగ. క్రిస్మస్ అనగానే క్రిస్మస్ కేరల్స్, గ్రీటింగ్స్, క్రిస్మస్ తాత, క్రిస్మస్ చెట్టు, ఇంటిని అందంగా అలంకరించడం, క్యాండిల్స్, పశువుల పాక, జ్ఞానులు... ఇలా చెప్పుకొంటూపోతే జాబితా చాలానే ఉంటుంది. అయితే ఈ సందర్భంలో పండుగల యొక్క ఉద్దేశ్యం ఏంటి? క్రైస్తవులు పండుగలు జరుపుకోవచ్చా? పండుగలను గూర్చి బైబిల్ ఏమి చెబుతుంది? క్రైస్తవులు పండుగలు జరుపుకొంటే ఎలా జరుపుకోవాలి? అనే విషయాల ను ఆచరణాత్మకంగా చర్చిద్దాం.

### పండుగ - నిర్వచనము

సాధారణంగా పండుగ అనగా ఒక సమాజం విశ్వసించే మత లేదా సంస్కృతి అంశాల ఆధారంగా ఆచరించే ఒక సంఘటననే పండుగ లేదా సంబరం అంటారు. పండుగలు జరుపుకోవడంలో ఆ సమాజం యొక్క మతపరమైన, సాంస్కృతికపరమైన విషయాలతో పాటలు, ఆచారాలు, అలవాట్లు, సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి.

### బైబిల్లో పండుగలు

పాతనిబంధన గ్రంథములో ఇశ్రాయేలీయులు సమాజంగా పండుగలు జరుపుకోవాలని దేవుడు ఆజ్ఞాపించాడు (నిర్గమ 34:12, లేవి 23:7) వారు ఐగుప్తు దేశపు బానిసత్వం నుంచి దేవుడు విమోచించిన కార్యాన్ని జ్ఞాపకం చేసుకొని పస్కాపండుగను జరుపుకొనేవారు.

ఇశ్రాయేలీయులు స్థిర నివాసం లేక గుడారాలలో నివసిస్తూ 40 సంIIలు ప్రయాణం చేశాక దేవుడు వారికి భూభాగాన్నిచ్చి స్థిరనివాసులై ఉండేటట్లు చేసినదాన్ని జ్ఞాపకం చేసుకుంటూ పర్ణశాలల పండుగను జరుపుకొనేవారు. ఇది వారి యాత్రా జీవితాన్ని తెలియజేస్తుంది.

దేవుడు గర్భఫలాన్ని, భూపంటలను, పశువులను



అనుగ్రహించడాన్ని జ్ఞాపకం చేసుకొని కృతజ్ఞతగా ప్రతి ప్రథమ ఫలము దేవునికి చెందినదని గుర్తించి అర్పిస్తూ జరుపుకొనే పండుగ ప్రథమ ఫలాల అర్పణ పండుగ.


ఇలా ఇశ్రాయేలీయులు 7 పండుగల ను జరుపుకొంటారు. దేవుని ఆజ్ఞ ప్రకారం ఇశ్రాయేలీయులు జరుపుకొనే పండుగల్లో ఆధ్యాత్మిక అర్థం ఇమిడి ఉంది. వారు భౌతికముగా జరుపుకునే పండుగలు ఆధ్యాత్మికత వైపుకు వారిని నడిపించేవి. యెహోవా దేవుని యొక్క గొప్పతనం గూర్చి ఇతర సమాజాల వారికి వివరించడానికి ఉపయోగపడుతూ, సమాజంగా వారి యొక్క ఐక్యతను, సంఘీభావాన్ని వ్యక్తపరచేవి.

క్రొత్తనిబంధనలో యేసుక్రీస్తు ప్రభువు యూదా సంప్రదాయం ప్రకారం పండుగలు జరుపుకున్నారు. ఇది ఆయన సంపూర్ణంగా ధర్మశాస్త్రానికి లోబడడాన్ని సూచిస్తూ, ఆయన సామాజిక జీవితాన్ని తెలియజేస్తుంది. క్రొత్తనిబంధనలో పండుగలు జరుపుకోవాలని గాని జరుపుకోకూడదని గాని స్పష్టంగా రాసిన సందర్భాలు లేవు. అయితే పౌలు రాస్తూ దేవుడు మనకు స్వాతంత్ర్యమునిచ్చే ఆత్మను ఇచ్చాడని అన్నాడు. కాబట్టి పండుగల విషయంలో బలవంతము లేదు. పండుగలు జరుపుకోవడానికి గానీ జరుపుకోకుండా ఉండడానికి గాని విశ్వాసులకు స్వాతంత్ర్యం ఉంది.

### పండుగలు - క్రైస్తవ దృక్పథం

నేటి క్రైస్తవులలో కొందరు యేసుక్రీస్తు యొక్క

## దేవుని ఏడు పండుగల క్యాలెండర్: లేవీయ కాండము 23




పుట్టుకను గుర్తు చేసుకొంటూ క్రిస్మస్‌ను, యేసుక్రీస్తు మరణ, పునరుత్థానములను జ్ఞాపకం చేసుకొంటూ గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగల్ని జరుపుకొంటున్నారు. పండుగలు జరుపుకోవాలని బైబిల్‌లో ఎక్కడా లేదు. కాబట్టి వాక్యానుసారం కాదని, పండుగల్లో శరీరాన్ని తృప్తిపరచుకోవడం జరుగుతుంది గనుక జరుపుకోకూడదని కొందరు క్రైస్తవులు అంటారు. కాని వాక్యంలో లేని చాలా విషయాలు మనం చేస్తున్నాం. ఉదాహరణకు ఫేస్‌బుక్, ఇంటర్నెట్, జూమ్, వాట్సాప్, గూగుల్ నెట్ మొదలగునవి విరివిగా వాడుతున్నాం. ఇవి వాడాలని బైబిల్‌లో ఎక్కడా లేదు. కానీ మన దైనందిన అవసరాలకు, పరిచర్య అవసరాలకు మనము సరైన విధంగా వీటిని ఉపయోగిస్తున్నాము. వీటిని అనేకులు దుర్వినియోగం చేస్తున్నారు. అలా అని మనం వాటిని నిషేధించలేదు. కానీ సరైన విధంగా ఉపయోగించుకొంటున్నాము.

పండుగ విషయాలలో కూడా కొందరు పండుగలను ఆసరా చేసుకుని శరీరాన్ని తృప్తిపరచుకోవడానికి అనగా తినడం, తాగడం, ఖరీదైన వస్త్రాలు మొ॥గు వాటిని చేయడానికి ఉపయోగిస్తున్నారు. వాటిని మనం తప్పక ఖండించాలి.

అయితే మనం చారిత్రక సత్యాలైన యేసుక్రీస్తు జనన, మరణ పునరుత్థానములను జ్ఞాపకం చేసుకొంటూ, తద్వారా మన జీవితాలలో జరిగిన విమోచన కార్యాన్ని తలపోసుకొంటూ ఆధ్యాత్మికత వైపుకు నడిపించే విధంగా పండుగల్ని జరుపుకోవచ్చు. ఈ పండుగల ద్వారా క్రీస్తునందలి మన విశ్వాసము, మనకు కలిగిన విమోచన, క్రైస్తవ జీవన విధానము ప్రతిబింబించే విధముగా ఉండాలి. పౌలు చెప్పినట్లుగా మనము ఏమి చేసినను దేవుని మహిమ కొరకు చేద్దాం (1 కొరింథీ 10:31).

### ఆచరణాత్మక సలహాలు

క్రైస్తవులంగా మనము పండుగలను జరుపుకొనేటప్పుడు అవి మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఉపయోగకరంగా, ఇతరులకు యేసుక్రీస్తును పరిచయం చేసే విధంగా ఉండాలి. క్రిస్మస్ సందర్భంలో క్రీస్తుపుట్టుక యొక్క ఆవశ్యకత, తద్వారా మానవాళికి కలిగిన విమోచన వివరించవచ్చు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని క్రీస్తు చనిపోతే ఎందుకు గుడ్‌ఫ్రైడే అయిందో వివరిస్తూ క్రీస్తు మరణం ద్వారా మానవాళికి కలిగిన రక్షణ గూర్చి వివరించవచ్చు. ఈస్టర్‌ను ఆధారం చేసుకొని యేసుక్రీస్తు పునరుత్థానం ద్వారా మానవాళికి అనుగ్రహించిన పాపక్షమాపణలను గూర్చి వివరిస్తూ సువార్తను పంచుకోవచ్చు. ఈ విధంగా పండుగలను క్రీస్తుప్రభువును పరిచయం చేయడానికి అవకాశాలుగా మలుచుకొందాం.

ఈ పండుగల సందర్భాలను వినియోగించి విద్యార్థులు తోటి విద్యార్థులకు, స్నేహితులకు వ్యక్తిగతంగా, చిన్న చిన్న కార్యక్రమాలను ఏర్పాటు చేయడం ద్వారా సువార్తను ప్రకటించవచ్చు. మనం ఇయులలో ఏర్పాటు చేసే క్రిస్మస్ ప్రోగ్రామ్స్‌కి వారిని ఆహ్వానించడం ద్వారా, సువార్త కరపత్రాలను ఇవ్వడం ద్వారా సువార్త ప్రకటించవచ్చు. ఈ సందర్భంలో వారిని ప్రేమపూర్వకంగా ఆహ్వానించడం, ప్రోగ్రామ్స్ క్రియేటివ్‌గా ప్లాన్ చేయడం, సమయపాలన



పాటించడం, మధురమైన సంగీతం వినిపించడం, స్పష్టంగా స్వచ్ఛమైన సువార్తను వారికి అర్థం అయ్యేలా ప్రకటించడమనేవి ప్రాముఖ్యం.

ఇతర సందర్భాలలో సువార్తను వినడానికి, క్రీస్తును గూర్చి తెలుసుకోడానికి సుముఖంగా ఉండరు కానీ పండుగ సందర్భాలలో వినడానికి, క్రీస్తును గూర్చి తెలుసుకోవడానికి ఆసక్తిని కనబరుస్తారు. కాబట్టి సువార్తను ప్రకటించడానికి ఇదొక మంచి అవకాశం. మనం ఈ సందర్భాలలో ఆహ్వానించాలనుకునే వారి జాబితాను ముందుగానే తయారు చేసుకొని వారి కొరకు క్రమం తప్పకుండా ప్రార్థించడం వలన మంచి ఫలితాల్ని చూస్తాం. వారి కొరకు ప్రార్థించడం అనేది ప్రాముఖ్యంగా, ప్రథమంగా చేయవలసింది.

గ్రాడ్యుయేట్స్ అయితే వారి సహోద్యోగులను, స్నేహితులను, బంధువులను ఆహ్వానించి వారికి ఆతిథ్యమిచ్చి వారికి సందర్భానుసారంగా సువార్తను పంచుకోవచ్చు. మన ఇజియఫ్ సహవాసం ఏర్పాటు చేసే కార్యక్రమాలకు ఆహ్వానించవచ్చు. మన యంపిసి విద్యార్థులు ద్వారా వారి స్నేహితులను మన ఇంటికి ఆహ్వానించి వారికి ఆతిథ్యమిచ్చి వారితో క్రీస్తును గూర్చిన విషయాలను చర్చిస్తూ సువార్తను అందించవచ్చు. వీటన్నిటినీ మనము క్రీస్తు ప్రేమతో, ఆయనకు మహిమ వచ్చే విధంగా చేయాలి.

## ముగింపు

ఈ పండుగల విషయంలో అనవసరమైన వివాదములకు అవకాశం ఇవ్వకుండా పండుగలను జరుపుకొనేవారు, జరుపుకోనివారు పరస్పర విమర్శలు చేసుకోకుండా ఈ సందర్భాలను సువార్తకు అవకాశాలుగా మార్చుకొని యేసుక్రీస్తు తెలియని వారికి పరిచయం చేద్దాం. వాక్య వ్యతిరేకమైన, లోకానుసారమైన ఆచారాలకు అవకాశం ఇవ్వకుండా మనము ఏమి చేసినా దేవుని మహిమ కొరకు చేద్దాం.

– **ఆర్. రాజ్‌కుమార్,** స్టాఫ్, తిరుపతి



## దేవుడే దిగివచ్చిన వేళ!

ఆహా...!
పుడమే పులకించిపోయింది
పరలోకమే దిగివచ్చిందంటూ!

ప్రకృతే పరవశించిపోయింది
సృష్టికర్తే దిగివచ్చాడంటూ!

అంధకారమే చెదిరిపోయింది
దివ్యమైన వెలుగొచ్చిందంటూ!

లోకమే నిర్ఘాంతపోయింది
అగాపే ప్రేమ జన్మించిందంటూ!

సర్వసృష్టే సాష్టాంగపడింది
అద్వితీయ అవతారుడంటూ!

బంధకమే వంగిపోయింది
విమోచకుడే విచ్చేశాడంటూ!

అసత్యమే తలవంచింది
సత్యస్థాపన జరిగిందంటూ!

నిర్జీవమే ఉజ్జీవమొందింది
జీవాశ చిగురించిందంటూ!

కాలమే నిలువునా చీలింది
అతడే యుగపురుషుడంటూ!

చరిత్రే సంబరపడింది
క్రీస్తు శకాన్ని ముద్రించానంటూ!

జీవిత గమ్యమే అంగీకరించింది
జీవ మార్గం అతడేనంటూ!

నమ్మిన హృదయమే హర్షించింది
క్రీస్తే ఏకైక రక్షకుడంటూ!

– **యస్. ఈశ్వర్** (ఆర్కిటెక్ట్)
మెహదీపట్నం జోన్



# నీతిమంతునిగా ప్రకటించడం

**గత సంచిక తర్వాత...**

### నీతిమంతులుగా తీర్పు పొందే విధానం

క్రీస్తు విధేయత ఆధారంగా ఒక పాపి దేవుని యెదుట నీతిమంతుడని తీర్పుపొందుతాడని చూశాం. అయితే ఈ నీతిని వ్యక్తిగతంగా సొంతం చేసుకొనే మార్గాన్ని లేక విధానాన్ని కూడా తెలిసికోవాలి. "విశ్వాసం ద్వారానే వ్యక్తి నీతిమంతుడని తీర్పు పొందుతాడని" పౌలు బోధించాడు (రోమా 1:17; గలతీ 3:11). పరిశుద్ధాత్మ దేవుడు బలపరచడం మూలంగా ఏర్పడిన ఒకని వ్యక్తిగత విశ్వాసం దేవుని నీతిని పొందుకోవడానికి దోహదపడుతుంది. క్రీస్తు విధేయత "ఆధారంగానే" తప్ప, విశ్వాసం ఆధారంగా నీతిమంతునిగా తీర్పు పొందలేరు. విశ్వాసం ఆధారం అయితే వ్యక్తి యోగ్యతగా పరిగణించాల్సి వస్తుంది. వ్యక్తి "కేవలం విశ్వాసం ద్వారా" నీతిమంతుడని తీర్పు పొందుతాడు. విశ్వాసం దేవుని కృపను పొందుకొనే "సాధనం" మాత్రమే. నీతి కేవలం క్రీస్తు నందలి విశ్వాసం ద్వారానే సొంతమౌతుందనే సత్యాన్ని పౌలు పదే పదే లేఖనాల్లో రాశాడు (రోమా 3:30, 5:1, 10:6; గలతీ 2:16, 3:24; ఫిలిప్పీ 3:9).

'విశ్వాసము అర్హత కాదు. కానీ దేవుడు ఉచితంగా అనుగ్రహించే రక్షణ వరాన్ని పొందడానికి సాధనం. విశ్వసించడం అంటే మన సొంత ప్రయత్నాల ద్వారా రక్షణ పొందడానికి చేసే ప్రతి ప్రయాసను విరమించడం, స్వయం సామర్థ్యం మీద ఆధార పడడాన్ని విడిచిపెట్టడం. దేవుడు తన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలం చెందడన్న ప్రగాఢ నమ్మకం వల్ల దేవుడిచ్చే వరాన్ని స్వీకరించడానికి చాచిన చేతులు లాంటిది విశ్వాసము' అని అంటారు లియాన్ మోరిస్ అనే దైవశాస్త్ర పండితుడు.[7]

అయితే నీతిమంతులుగా అనుభవము పొందగల విశ్వాస స్వభావం ఏంటి? ఎలాంటి విశ్వాసం ద్వారా పాపి దేవుని యెదుట నీతిమంతునిగా తీర్పుపొందుతాడు? కేవలం విశ్వాసం ద్వారానే నీతిమంతునిగా తీర్పుపొందుతారు అనే సత్యాన్ని ప్రజలు అర్థం చేసుకోకపోవడానికి కారణం "విశ్వాసం" అంటే ఏంటో వారికి తెలియకపోవడమే నని అంటారు మార్టిన్ లూథర్.[8] సంఘ సంస్కరణ కాలంలో ఈ విశ్వాసంలో అంతర్భాగమైన మూడు అంశాలు ప్రధానంగా వెలుగులోకి వచ్చాయి:

### 1. విశ్వాసం - జ్ఞానం

విశ్వాసం, జ్ఞానం సమరూపాలు కాదు గానీ విశ్వాసంలో జ్ఞానం లేకుండా ఉండడం సాధ్యం కాదు. విశ్వాసంలో రక్షణ పొందడానికి అనివార్యంగా నమ్మవలసిన విషయాలు ఉంటాయి. అది కేవలం

Footnotes

7. The Atonement – Its Meaning and Significance by Leon Morris, P-198
8. Quoted by AlisterMcgrath in 'Christian Theology: An Introduction', Wiley Blackwell Publisher, 6th Edition

చారిత్రక జ్ఞానం కాదు. సువార్తకు సంబంధించిన చారిత్రక విషయ పరిజ్ఞానం క్రైస్తవ విశ్వాసానికి సరిపోదు. నీతిమంతులుగా తీర్చబడే అనుభవ జ్ఞానంలోకి నడిపే విశ్వాసంలో వ్యక్తిగతంగా క్రీస్తు మనకోసం జన్మించారని, మన కొరకు రక్షణ కార్యాన్ని పూర్తి చేశారని నమ్మడం, విశ్వసించడం ఇమిడి ఉంటాయి.

## 2. విశ్వాసం - మేధాసంబంధ సమ్మతి

మేధాసంబంధ సమ్మతి అంటే విశ్వసనీయమైన సమాచారం సత్యమనే నిశ్చయత లేక దృఢమైన నమ్మకాన్ని కలిగి ఉండడం. సువార్తకు సంబంధించిన సమాచారం (మానవ పాపస్థితి, రక్షణ ఆవశ్యకత, యేసుక్రీస్తు దైవత్వం, మానవత్వం, చరిత్రలో యేసు జీవిత– మరణ– పునరుత్థానాలు) అంతా సత్యమని మనసులో అంగీకరించడం. ఈ రకమైన మనస్సులోని సమ్మతి మతపరమైన విశ్వాసం. ఈ స్థాయిలో విశ్వాసం మానవ "చిత్తానికి" సంబంధించినది కాదు, అందుకే దీనిని నీతిమంతులుగా తీర్చే విశ్వాసంగా లేక రక్షణ పొందడానికి అవసరమైన విశ్వాసంగా పరిగణించలేము. సాతాను, అతనిని వెంబడించే పతనమైన దేవదూతలకు సువార్తకు సంబంధించిన ప్రతీ సమాచారం సత్యమని తెలుసు కానీ వాళ్ళకు పాప విముక్తినిచ్చే రక్షణ విశ్వాసం లేదు (యాకోబు 2:19), ఎందుకంటే విశ్వాసానికి అవసరమైన అతిప్రధాన భాగం కొదువగా ఉంది.

## 3. విశ్వాసం - విశ్వసించడం (Trust):

విశ్వాసం అంటే ఒక విషయం సత్యమని కేవలం నమ్మడం కాదు; ఆ నమ్మకానికి స్పందించడానికి సుముఖంగా ఉండడం, దాని మీద ఆధారపడడం. విశ్వసించడం అంటే ఒక విషయం పట్ల మనసు లేక ఆత్మ అనుకూలంగా స్వభావంలో మొగ్గు చూపించడం. రక్షణార్థమైన విశ్వాసంలో ఈ భాగం కేవలం ఆలోచనలకు పరిమితం కాదు గానీ "చిత్తం"లో ప్రతిస్పందనతో కూడినదై ఉంటుంది. ఉదాహరణకు మందులు వాడితే రోగం నయమవుతుందనే విషయం సత్యం అని నమ్మితే రోగం నయంకాదు, ఆ తెలిసిన సత్యం వెలుగులో స్పందించాలి – అంటే మందుల్ని వాడి తీరాలి.

ఈ మూడు అంశాలు నీతిమంతులుగా తీర్చే విశ్వాసంలో అంతర్భాగమై ఉంటాయి. క్రియలు లేని విశ్వాసం మృతం అంటారు యాకోబు (యాకోబు 2:17), నిజమైన విశ్వాసం క్రియలతో కూడినదై ఉంటుంది. క్రియలు దేవుని యెదుట నీతిమంతులుగా తీర్పు పొందడానికి ఏమాత్రం ఉపయోగపడవు, అయితే అవి విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్పు పొందడంలో నుండి ప్రవహిస్తూ నీతిమంతులుగా తీర్పు పొందామనడానికి నిదర్శనంగా నిలుస్తాయి. ఎందుకంటే నీతిమంతులుగా తీర్పుపొందిన వాళ్ళు దేవుని కృప పట్ల కృతజ్ఞత గలిగి మంచి పనులు చేయడంలో పాల్గొంటారు కాబట్టి. లూథర్ భక్తుడు "నీతిని" రెండు రకాలుగా వర్గీకరిస్తారు: 1. విశ్వాసికి అతీతమైన నీతి – క్రీస్తునీతి, ఇది విశ్వాసులకు దేవుడు ఆపాదించే నీతి. 2. వాస్తవిక నీతి – విశ్వాసం ద్వారా ఆపాదించిన క్రీస్తు నీతిమీద ఆధారపడి చేసిన సత్క్రియల ద్వారా విశ్వాసులకు లభించిన నీతి. ఈ క్రమం చాలా కీలకం, మొదట ఆపాదించడం ద్వారా సొంతమైన క్రీస్తునీతి, ఆ తరువాత విశ్వాస క్రియలతో కూడిన వాస్తవిక నీతి.

## సిద్ధాంతము - సమకాలీన చర్చ

పౌలు భక్తుడు రాసిన రచనలను సంఘ సంస్కర్తలు అసలు సరిగా అర్థం చేసుకొన్నారా? ప్రాముఖ్యంగా పౌలు రాసిన రోమా పత్రిక, గలతీయులకు రాసిన పత్రికలకు సరిగా భాష్యం చెప్పారా? లేక మార్టిన్ లూథర్ లాంటి సంఘ సంస్కర్తలు తమ సమకాలీన దృక్పథాలను లేఖనాలలోకి చొప్పించి తప్పుగా అర్థం చేసుకొన్నారా? అనే ప్రశ్నలకు అవుననే అంటారు క్రిస్టర్ స్టెండాల్, ఇ.పి.సాండర్స్, జేమ్స్ డి.జి. డన్, ఎన్.టి.రైట్ లాంటి సమకాలీన దైవశాస్త్ర పండితులు. ఈ క్రొత్త దృక్పథానికి "పౌలును గూర్చిన క్రొత్త దృక్పథం"గా నామకరణం చేశారు ఇ.పి. సాండర్స్. అయితే ఈ వివాదం ఏంటి? పౌలు పట్ల ఉన్న పాత–క్రొత్త దృక్పథాల మధ్య వ్యత్యాసాలు ఏంటి? క్రొత్త దృక్పథంలోని లోపాలను చాలా క్లుప్తంగా చూసే ప్రయత్నం చేద్దాం.



పౌలు రోమా పత్రిక, గలతీ పత్రికలలో అసలు ఎవరితో వాదిస్తున్నాడు అనేది ఈ వివాదంలో అతి ప్రధానాంశం. ఈ వివాదాన్ని "పౌలును గురించిన క్రొత్త దృక్పథం" అనడం కంటే "పౌలు ప్రత్యర్థుల పట్ల క్రొత్త దృక్పథం" అని పిలవడమే సమంజసం. ఎందుకంటే పౌలు అసలు ఎవరితో వాదిస్తున్నాడు అనే చారిత్రక నేపథ్యం మీదనే, ఆయన దేనికోసం రాశాడు/దేని కోసం వాదించాడు అని సరిగా అర్థం చేసుకోవడం మీద ఆధారపడి ఉంటుంది. ధర్మశాస్త్రం నిర్దేశించిన క్రియలు తప్పనిసరిగా చేయడం ద్వారా ఒక వ్యక్తి దేవుని ఆమోదాన్ని, అనుగ్రహాన్ని పొందగలడు, దేవునితో వ్యక్తిగత సంబంధంలోనికి రావడానికి విశ్వాసంతో పాటు ధర్మశాస్త్ర క్రియలు అనివార్యం అని వాదిస్తున్న ప్రత్యర్థులతో (legalistis) పౌలు రోమా, గలతీ పత్రికలలో వాదించాడు అనేది మార్టిన్ లూథర్ లాంటి సంఘ సంస్కర్తల భావన. కాబట్టి పౌలు కేవలం విశ్వాసం ద్వారా మాత్రమే ఎవరైనా దేవుని యెదుట నీతిమంతులుగా తీర్పు పొందుతారు తప్ప ఏవిధమైన క్రియలు రక్షణకు అనివార్యం కాదు అని వాదించాడు అనేది పాత దృక్పథం. అయితే ఒక్కొక్కరుగా ప్రతీ వ్యక్తి దేవునితో సంబంధంలోకి రావడం అనే భావన రోమా పత్రికలో లేనేలేదు. ఆ విధమైన 'వ్యక్తిగతమైన' (individualistic) అలోచనా విధానం "ఆధునిక వాద" పోకడని, అలాగే 'ఆత్మశోధనతో కూడిన మనస్సాక్షి' (Introspective Conscience) పాశ్చాత్య ఆధునిక వాదం వల్ల వచ్చింది కాబట్టి లూథర్ భక్తుడు ఈ రకమైన ఆలోచనలను రోమా పత్రికలోనికి చొప్పించి అర్థం చేసికొన్నారు అని అంటారు క్రిస్టర్ స్టెండాల్[9].

"దైవమానవ" నిట్టనిలువు సంబంధానికి క్రియలు అనివార్యం కాదు అని, దేవుని "నిబంధన ప్రజగా" మారడం కేవలం కృప ద్వారానే జరుగుతుంది. అయితే ఆ **నిబంధనలో కొనసాగడానికి** ధర్మశాస్త్రం అనుసరించి బ్రతకడం తప్పనిసరి అని పౌలు సమకాలీన యూదులు విశ్వసించారు అనేది క్రొత్త దృక్పథం. ఇశ్రాయేలీయులు దేవునితో నిబంధనలోనికి వచ్చింది, దేవుని ప్రజ అయ్యింది కేవలం కృప ద్వారానే, అయితే ఆ నిబంధనకు విశ్వాసపాత్రుడుగా ఉండడానికి ధర్మశాస్త్రాన్ని పాఠించాలి. దీనినే "నిబంధనా నియమావళి" (Covenantal nomism) అని ఇ.పి. సాండర్స్ అంటారు[10]. ధర్మశాస్త్ర సంబంధ క్రియలు చేయడం అంటే యూదులు-అన్యులు మధ్య ఉన్న వ్యత్యాసానికి గురుతులుగా (boundary markers) ఉన్న సున్నతి, సబ్బాతు, ఆహార నియమాలు పాఠించడమే. కాబట్టి క్రొత్త దృక్పథం వాదన ప్రకారం పౌలు ఎదుర్కొన్న వివాదం లీగలిజం (క్రియల ద్వారా రక్షణ) కాదు గానీ, క్రైస్తవులుగా మారుతున్న అన్యులు యేసుక్రీస్తులో విశ్వాసం ఉంచడంతో పాటుగా యూదుల విలక్షణతకు చెందిన వాటిని అవలంభించాలా లేదా అనే దాని గురించి. క్రొత్త దృక్పథం ప్రకారం రోమా, గలతీ పత్రికలలో పౌలు ఎదుర్కొన్న అసలు సమస్య "దైవమానవ" నిట్టనిలువు సంబంధానికి చెందినది కాదు, "యూదులు-అన్యుల" మధ్య అడ్డంగా నిలిచిన సామాజిక అంశం. కాబట్టి ఎన్.టి. రైట్ దృష్టిలో "నీతిమంతులుగా తీర్చబడడం" అనే సిద్ధాంతం మౌళికంగా "రక్షణకు చెందిన సిద్ధాంతం" కాదు గానీ "సంఘానికి చెందిన సిద్ధాంతం".

రోమా పత్రిక, గలతీ పత్రికలను సరిగా అర్థం చేసుకోవడానికి పౌలు అసలు ఏ గుంపును ఉద్దేశించి ఆ పత్రికల్లో వాదించాడు అనే చారిత్రక నేపథ్యం కీలకం. అదే పౌలు మాటల్ని సరిగా అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది. భిన్న దృక్పథం కలిగినవాళ్ళు ఒకే వాక్యభాగాన్ని మొత్తంగా భిన్నమైన మార్గంలో అర్థం చేసుకొనే అవకాశం ఉంది. ఉదాహరణకు ఒకే వాక్యభాగాన్ని ఈ రెండు దృక్పథాలకు చెందిన పండితులు ఎలా అర్థం చేసుకొంటారో చూద్దాం.

"ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున గాక క్రీస్తునందలి విశ్వాసము వలననే నీతిమంతుల మని తీర్చబడుటకై యేసుక్రీస్తునందు విశ్వాసముంచి యున్నాము. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూల మున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు గదా" (గలతీ 2:16; రోమా 3:28). ఈ వాక్యభాగాన్ని ఈ రెండు దృక్పథాల పండితులు భిన్నంగా అర్థం చేసుకొంటారు:

Footnotes

9. Encountering the book of Romans by Douglas J Moo, Baker Academic , P-24
10. Justification and the New Perspective on Paul – A review and response by Guy Prentiss Waters, P&R Publishing, P-37-38

## పాత దృక్పథం

యూదామత ప్రభావం ఉన్న వాళ్ళు దేవుని యెదుట క్షమాపణ పొంది, నీతిమంతులుగా తీర్పు పొందడానికి విశ్వాసంతో పాటు ధర్మశాస్త్రసంబంధమైన క్రియలు అవసరం అని చెబుతున్నారు గానీ, వాస్తవానికి ఒక వ్యక్తి ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలను, క్రియా న్యాయమును బట్టి కాకుండా కేవలం విశ్వాసం ద్వారా కృపచేతనే దేవునియెదుట నీతిమంతుడని తీర్పుపొందుతాడు. (దైవ-మానవ నిట్టనిలువు సమస్య-వ్యక్తి కేంద్రితం-రక్షణ సిద్ధాంతం: క్రియా మూలమైనది కాదుగానీ కేవలం విశ్వాసం ద్వారా దేవుని యెదుట నీతిమంతుని స్థానం)

## క్రొత్త దృక్పథం

యూదామత ప్రభావం ఉన్న వాళ్ళు, మనుషులు "దేవుని క్రొత్త నిబంధన ప్రజలలో" చేరడానికి యేసుక్రీస్తుకు ఆధీనులుగా ఉండడంతోపాటు సాంస్కృతిక సరిహద్దు గురుతులైన సున్నతి, సబ్బాతు, ఆహార నియమాలు పాటించడం తప్పనిసరి అని చెబుతున్నారు. అయితే మనుషులు దేవుడు ఆహ్వానించడం ద్వారానే "దేవుని క్రొత్త నిబంధన ప్రజలలో" భాగస్వాములు అవుతారు. దేవుని క్రొత్త నిబంధన ప్రజలలో సభ్యత్వానికి, నిబంధన ప్రజగా కొనసాగడానికి సాంస్కృతిక సరిహద్దు గురుతుల్ని పాటించకుండానే యేసుక్రీస్తుకు కేవలం ఆధీనులుగా ఉండడమొక్కటే చాలు. (క్షితిజ సమాంతరం సమస్య - సామాజికమైనది - సంఘాన్ని గురించిన సిద్ధాంతం)

"పౌలును గురించిన క్రొత్త దృక్పథం" అనే ఈ దృక్పథం ప్రొటెస్టంట్ దృక్పథంతో వ్యత్యాసాలు ఉన్న దృక్పథం.. అయితే ఈ రకమైన దృక్పథాలు కలిగిన వాళ్ళు కనీసం మూడు కీలక విషయాలలో చారిత్రక ప్రొటెస్టెంట్ 'నీతిమంతులుగా తీర్చడం' బోధతో విభేదిస్తున్నారు[11] : 1. ధర్మశాస్త్ర సంబంధ క్రియలు 2. నీతి 3. నీతిమంతులుగా తీర్చడం.

| అంశం | ప్రొటెస్టెంట్స్ | పౌలును గురించిన క్రొత్త దృక్పథం |
|---|---|---|
| ధర్మశాస్త్ర సంబంధ క్రియలు | క్రియలద్వారా దేవుని యెదుట నీతిమంతులుగా తీర్పుపొందడాన్ని పౌలు వ్యతిరేకించాడు. | క్రైస్తవులుగా మారుతున్న అన్యులు యూదులతో కలిసేటప్పుడు సాంప్రదాయ దేశీయ సరిహద్దు గురుతులైన సున్నతి, సబ్బాతు, ఆహార నియమాలు ఆచరించాలి అనే ఇశ్రాయేలీయుల బోధను వ్యతిరేఖించాడు. క్రొత్త సరిహద్దు కేవలం విశ్వాసం మాత్రమే. |
| దేవుని నీతి | విశ్వాసముంచే పాపికి తన యెదుట 'నీతిమంతుడు' అని దేవుడు అనుగ్రహించే స్థానం. మానవులకు దేవుడు ఇచ్చేది. | దేవుని సొంత నీతి - తన నిబంధనా విశ్వాస్యత |
| నీతిమంతులుగా తీర్చడం | దేవుడు తన కృపను బట్టి యేసుక్రీస్తు జీవిత, మరణాలలో చూపించిన విధేయత ఆధారంగా, విశ్వాసం ద్వారా క్రీస్తుతో ఐక్యమయ్యే పాపికి క్రీస్తు నీతిని ఆపాదించి, తన యెదుట నీతిమంతుడని ప్రకటించే న్యాయపరమైన చర్య. | 'నీతిమంతులుగా తీర్చడం' రక్షణ పొందడానికి సంబంధించిన విషయం కాదు గానీ దేవుని ప్రజలో సభ్యునిగా ప్రకటన పొందడం. నీతిమంతులుగా ప్రకటించడం అబ్రహాము కుటుంబాన్ని నిర్వచించడానికి సంబంధించినది[12]. |

## విమర్శ:

1. ''పౌలును గురించిన క్రొత్త దృక్పథం''

Footnotes

11. The giver of life – the biblical doctrine of the Holy Spirit and Salvation by J.V. Fesko
12. Paul and the Faithfulness, N.T. Wright, P-856,859

ప్రతిపాదించినట్లు పౌలు సువార్త ప్రకటించిన కాలంలో యూదామతం మొత్తం ఏకరీతిగా 'క్రియలు-నీతి: రక్షణ' దృక్పథాన్ని కలిగి లేదని అంటారు రాబర్ట్.జే. కారా[13].

2. "నిబంధనా నియమావళి" (Covenantal nomism) నిర్వచనం ప్రకారం రక్షణ కృపకు మానవ ప్రయత్నం సహకరించడం వల్ల సాధ్యమతుంది అనే పాక్షిక-పెలేజియన్ సిద్ధాంతమవుతుంది, అది వాక్య విరుద్ధం.
3. నిబంధన ప్రజలోనికి 'ప్రవేశించడం' క్రియల ద్వారా 'నిలచియుండడం' అనే "నిబంధనా నియమావళి" (Covenantal nomism) భావన అంతిమ తీర్పును పలుచన చేసేస్తుంది.
4. రెండవ దేవాలయ యూదామతంలో ప్రతీసారీ కృపద్వారానే 'దేవుని ఎంపిక' అని స్పష్టంగా లేదు.[14]

రోమా పత్రిక మొత్తానికి కీలక వచనమైన "సువార్తను గూర్చి సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసుదేశస్థునికి కూడా రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16): రక్షణ ప్రాథమికంగా పాపికి-దేవునికి మధ్యగల సంబంధాన్ని పునరుద్ధరించడానికి చెందినదని స్పష్టం చేస్తుంది. సువార్త విశ్వసించిన ప్రతివానికి రక్షణ తీసుకొస్తుంది అని స్పష్టం చేసిన తరువాతే పౌలు 'యూదా-అన్య ప్రజలకు' సంబంధించిన విషయం గురించి ఈ వచనంలో ప్రస్తావించడం చూస్తాము. కాబట్టి 'యూదులు-అన్యుల' మధ్యగల సంబంధానికి చెందిన విషయం 'దైవ-మానవ' సంబంధానికి చెందిన విషయానికంటే అప్రధానము, సువార్త 'వ్యక్తిగత రక్షణ', 'దేవుని క్రొత్త జనాంగం' గురించి కూడా అంతే గానీ ఏదో ఒకదానికి సంబంధించింది అని చెప్పడానికి వీలు లేదు అని అంటారు డగ్లస్. జే. మూ[15]

యూదుల విశ్వాసం ప్రకారం రక్షణ జీవిత ముగింపు వరకూ ప్రధానం చేయడం జరగదు గనుక, అప్పటి వరకూ దేవుని ధర్మశాస్త్రానికి విధేయత చూపడం రక్షణకు తప్పనిసరి అవుతుంది. తమ జీవితాలలో "దేవుని కృపను క్రియాత్మకం చేయడానికి ధర్మశాస్త్రానికి తాము సొంతంగా విధేయత చూపడమే మార్గం" అని ఆధారపడడం, యూదులు రక్షణ పొందడానికి క్రియలను తప్పనిసరి చేసారు అనడానికి రుజువు. మొదటి శతాబ్దంలో యూదుల సమస్య 'క్రియల ద్వారా రక్షణ' (legalism) అని క్రొత్త నిబంధన చాలా స్పష్టంగా బయలు పరుస్తుంది అంటారు డగ్లస్.జే.మూ[16]

ధర్మశాస్త్రానికి మాత్రమే కాదు మరి ఏ విధమైన నియమ నిబంధనలకు విధేయత చూపినా మనిషికి రక్షణ సాధ్యంకాదు అని మార్టిన్ లూథర్ లాంటి సంఘసంస్కర్తలు చేసిన వాదన క్రొత్తనిబంధన, ప్రత్యేకంగా పౌలు రాసిన లేఖనాల సారాంశానికి అనుగుణ్యంగా ఉంది అనేది చాలమంది సమకాలీన పండితుల అభిప్రాయం.

## ఫలితాలు:

### 1. సమస్త పాపాల క్షమాపణ:

యేసు క్రీస్తు నామంలోనే పాపక్షమాపణ ప్రచురమగుచున్నదని ప్రకటించారు పౌలు భక్తుడు (అ.కా 13:38), విశ్వసించిన ప్రతీవాడు క్రీస్తువలననే నీతిమంతుడుగా తీర్పుపొందుతాడని తెలియజేశారు (అ.కా13:39). నిర్దోషియైన క్రీస్తు చిందించిన రక్తము మన మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేస్తుంది (హెబ్రీ 9:14). నీతిమంతునిగా తీర్పు పొందినప్పుడు కలిగే మొదటి ఆశీర్వాదం విశ్వాసి పాపాలను వానిమీద మోపకుండా (2 కొరింథీ 5:19), తన కుమారుని పరిపూర్ణ నీతిని దేవుడు అనుగ్రహించడం (1 కొరింథీ 1:30; ఫిలిప్పీ 3:9). దేవుడు మన పాపాల్ని ఎంతగా పరిహరిస్తారంటే వాటిని ఇక ఎన్నటికీ జ్ఞాపకం చేసుకోరు (యిర్మీయా 31:34; యెషయా 43:25). అయితే అనంత జ్ఞానం కలిగిన దేవుడు జ్ఞాపకముంచుకోను అంటే ఆయన మరచిపోతారని అర్థం కాదు, అది అసాధ్యం కూడా! "దేవుడు గుర్తుంచుకొంటే, దానర్థం ఆయన చర్య

Footnotes

13. The Doctrine on which the Church stands or falls – Justification in Biblical, Theological, Historical and Pastoral Perspctive, Ed by Matthew Barrett, Crossway, Chapter 4
14. Cracking the foundation of the New Perspective on Paul – Covenantal Nomism Versus Reformed Covenantal Theology by Robert J. Cara, Chapter 2.
15. Encountering the book of Romans by Douglas J Moo, Baker Academic , P-28
16. Ibid, P-28

తీసుకొంటారని, ఒక వేళ గుర్తు చేసుకోకూడదు అని అనుకొంటే, అప్పుడు మళ్ళీ ఏ చర్యలు చేపట్టరనే. అభియోగాన్ని కొట్టేసినట్లు" అంటారు క్రిస్ రైట్.[17] వ్యక్తితో వ్యవహరించేటప్పుడు పాపాలు ఏమాత్రం ఆటంకంగా నిలువవని అర్థం, అంటే జీవితంలో ఎన్నడూ పాపం చేయని వ్యక్తితో వ్యవహరించినట్లు దేవుడు మనతో వ్యవహరిస్తారన్నమాట.

### 2. శిక్షావిధి కొట్టి వేయడం

క్రీస్తుయేసునందున్న వారికి ఏ శిక్షావిధి లేదని పౌలు భక్తుడు రాశాడు (రోమా 8:1). దేవుడే స్వయంగా తన యెదుట విశ్వాసిని నీతిమంతుడని తీర్పుతీర్చడం వల్ల అపరాధ అర్హమైన భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలకు చెందిన ఏ నేరారోపణ విశ్వాసి పట్ల చేయడానికి వీలు లేదు. దేవుని చేత ఏర్పరచబడిన వానిమీద నేరము మోపువాడెవడు? నీతిమంతులుగా తీర్చువాడు దేవుడే – రోమా 8:33). నీతిమంతునిగా తీర్పుపొందిన పరిశుద్ధుడు యేసుక్రీస్తులో పరిపూర్ణమైన న్యాయపరమైన స్థానాన్ని దేవుని యెదుట కలిగి ఉన్నాడు.

### 3. నిత్యజీవమనే వరం

సిలువలో ఉన్న దొంగకు 'నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉంటావు' అని వాగ్దానం చేశారు యేసుక్రీస్తు. నీతిమంతునిగా తీర్పుపొందిన నేరస్థునికి వెంటనే ఇచ్చిన బహుమానం "నిత్యజీవం". నీతిమంతులుగా తీర్పు పొందిన మనకు నిత్యజీవాన్ని గురించిన నిరీక్షణ ఉంది (తీతుకు 3:6,7), అలాగే 'నిత్యజీవం' నీతిమంతులుగా తీర్పుపొందడం వల్ల వచ్చిన ఆశీర్వాదము (రోమా 5:18,21).

### 4. దేవుని పరిశుద్ధ కుటుంబములోనికి దత్తత

న్యాయస్థానంలో నిర్దోషిగా తీర్పుపొందిన ప్రతి వ్యక్తి న్యాయాధిపతి కుటుంబంలోనికి దత్తత తీసుకోవడానికి అర్హుడైనట్లుకాదు. అయితే దేవుడు తన కృపను విశ్వాసి పట్ల అపారంగా చూపించడాన్ని బట్టి, నీతిమంతులకు తన కుటుంబ సభ్యులు గా ఉండే భాగ్యాన్ని ఇచ్చారు. నీతిమంతులుగా తీర్పు పొందకుండా దత్తత సాధ్యం కాదు, గనుక దత్తత పొందడానికి నిర్దోషులుగా తీర్పుపొందడం తార్కికంగా అవసరం. దేవుడు విశ్వాసిని నిర్దోషిగా ఎంచడమే కాదు తన పరిశుద్ధ కుటుంబంలోనికి దత్తత



తీసుకొంటారు అని లేఖనం చెబుతుంది (ఎఫెసీ 1:5; గలతీ 4:5–7; రోమా 8:15,17).

### కాబట్టి...

1. మనం దేవుని పిల్లలమనే కొత్త గుర్తింపు కలిగి ఉన్నాము (1 యోహాను 3:1)
2. పరిశుద్ధాత్మ దేవుని సన్నిహిత నివాసము అనుభవిస్తాము (రోమా 8:14; గలతీ 4:6)
3. దేవుని ప్రత్యేకమైన ప్రేమను పొందిన నిశ్చయత వస్తుంది (1 యోహాను 4:9–11)
4. ప్రియమైన దేవుని పిల్లలుగా ప్రత్యేక సంరక్షణలో ఉంటాము (లూకా 11:11–13)
5. దేవుని సన్నిధిలోనికి ధైర్యంగా ప్రవేశించగలిగే అర్హత ఉంది (హెబ్రీ 10:10–20, 2:10–13)
6. దేవుడు ప్రేమతో మనల్ని క్రమశిక్షణలో పెడతారు, పవిత్ర పరుస్తారు (హెబ్రీ 12:7–8)
7. దేవుని నిత్యరాజ్యానికి, మహిమకు మనం వారసులము (రోమా 8:17)

### అన్వయం - ఆచరణాత్మక సత్యాలు

1. దేవుని పట్ల కృతజ్ఞత కలిగి జీవించాలి.
2. దేవుని ఆమోదాన్ని పొందిన, విమోచన పొందిన వాళ్ళ కుటుంబ సభ్యులుగా సంపూర్ణ నిశ్చయతతో బ్రతకాలి (1 యోహాను 5:13).

Footnotes

17. The message of Jeremiah by Christopher Wright , BST, 31:34

3. విశ్వాసులు అపరాధభావాల నుండి విడుదల పొందామని గ్రహించాలి, అనుభవించాలి.

నీతిమంతుడైన దేవుడే మనల్ని క్షమించి, పవిత్రీకరించి, పాపం మరియు అపరాధభావాల భారం నుండి విడిపించారు గనుక నీతి మంతులుగా తీర్పుపొందామన్న సత్యం వెలుగులో సంతోషంగా బ్రతకాలి. మనల్ని మనం అంగీకరించుకోవాలి, లేదంటే దేవుని అంతిమ న్యాయస్థానం కంటే మనల్ని మనం హెచ్చించుకోవడమే అవుతుంది అంటారు సి.యస్. లూయిస్. దేవునితో సన్నిహితంగా బ్రతికేకొద్దీ మనలోని లోపాలు సుస్పష్టమౌతాయి (యెషయా 6:5), అయితే అపరాధ భావంతో కృంగిపోకుండా నిరంతరం క్షమాపణ కోసం దేవుని చేరి, కల్మషం లేని మనస్సాక్షితో ఆధ్యాత్మిక జీవితంలో ముందుకుసాగే నిర్మాణాత్మక వైఖరి కలిగి ఉండాలి (1 యోహాను 1:9).

4. మన ప్రవర్తన అర్హతల ఆధారంగా కాకుండా కేవలం తన కృపచేత మనల్ని తన కుటుంబంలో సభ్యులుగా దేవుడు అంగీకరించారు కాబట్టి, ఈ పిలుపుకు తగినట్లు ప్రవర్తించే ప్రయత్నం చేయాలి.

5. దేవుడు మన పాపాల్ని ఎన్నటికీ జ్ఞాపకం చేసుకోరు కాబట్టి మనం తోటి విశ్వాసులను క్షమించడం మాత్రమే కాదు, వారితో వ్యవహరించేటప్పుడు వారి గతం మనల్ని ప్రభావితం చేయకూడదు మరియు వారిని వారి గతం దృష్టితో చూడకూడదు.

6. యేసు క్రీస్తును బట్టి మనల్ని, మన పనుల్ని, మన ప్రయత్నాల్ని తనకు ఇష్టమైనవిగా, అంగీకార యోగ్యమైనవిగా దేవుడు ఎంచుతున్నారు, కాబట్టి పతనమైన ప్రపంచంలో సాధ్యంకాని పాపరహిత పరిపూర్ణ జీవితం జీవించాలన్న భారం నుండి విడుదల పొందాలి.

7. మన అర్హతలను బట్టి కాక కేవలం యేసు క్రీస్తుని బట్టి దేవుడు మనల్ని సంపూర్ణంగా అంగీకరించడం, అలాగే నీతిమంతులుగా పరిగణిస్తున్నారు కాబట్టి రక్షణ విషయంలో ఆందోళన, సందేహాలు, భయాలు, అపరాధభావాలు, మనల్ని మనం ఏవగించు కోవడం విడనాడాలి. ✪ సమాప్తం

**– డి. అనిల్ కుమార్,** వైజాగ్



## సవాలు

# కన్నీరు ఉందా?

ఇంగ్లండ్‌లో చార్లీపీస్ అనే నేరస్తుడు ఉండేవాడు. అతనిలోని నేరగుణాన్ని దేవుని ఆజ్ఞలు గాని ప్రభుత్వ చట్టాలు గాని మార్చలేకపోయాయి. చివరకు ప్రభుత్వం అతనిని పట్టుకుని మరణశిక్ష విధించింది. ఇంగ్లండ్‌లోని ఆర్మీ చెరసాలలో, అతని జీవితపు చివరి గడియలో ఉరి శిక్ష వేసే స్థలానికి అతన్ని తీసుకొని వెళ్తున్నప్పుడు, చెరసాల మత గురువు తన వాడుక ప్రకారం నిద్రమత్తుతో అతని ముందు నడుస్తూ, కొన్ని బైబిల్ వాక్యాలు చదువుతున్నాడు. చార్లీపీస్ ఆ భోధకుని తాకి, మీరేమి చదువుచున్నారు? అని అడిగితే, బోధకుడు "దేవుని వాక్యంలోని ఊరడింపు మాటలు" అని జవాబిచ్చాడు. తన వృత్తిపరంగా నరకమును గూర్చి అతడు చదివిన విధానమును చూచి చార్లీపీస్ విస్మయానికి గురవుతాడు. తాను చదువుతున్న ఆ అంతులేని అగాధంలో తోటి మనుష్యుడు పడుతున్నాడని తెలిసిన ఏమనుష్యుడైనా కన్నీరు రాని కళ్ళతో ఉండగలడా? అసలు ఈ బోధకుడు నిత్యాగ్ని ఉందనే మాటను నమ్మికూడా ఏ మాత్రం వణుకు లేకుండానే నిర్లక్ష్యంగా చదువుతున్నాడా? "నీవు నిత్య మరణాన్ని పొందబోవుతున్నావు. ఆ మరణం వల్ల నీకు ఎప్పుడూ ఉపశమనం కలుగదు" అని కన్నీరు కార్చకుండా చెప్పే వ్యక్తి అసలు మనిషేనా? చార్లీపీస్‌కు ఇదంతా భరించలేనిదిగా అనిపించింది. నరకాన్ని గూర్చిన ప్రసంగాన్ని విన్న అతడు ఈ విధంగా అన్నాడు. అయ్యా! మీరు, దేవుని సంఘము దేనినైతే నమ్ముచున్నామని చెబుతున్నారో దానిని నేను కూడా నమ్మి ఉంటే, ఈ ఇంగ్లాండ్ దేశం మొత్తం ఈ తీరం నుండి ఆ తీరం వరకు గాజు పెంకులతో కప్పబడినా అవసరమైతే చేతుల మీద, మోకాళ్ళ మీదైనా నడిచి ఒక్క ఆత్మనైనా నరకాగ్ని నుండి తప్పించేవాడినని అన్నాడు".

సువార్తను ప్రకటించేటప్పుడు నీవు నశిస్తున్నావు అని అలవాటుగా చెబుతున్నామా? లేక కన్నీరు కారుస్తూ చెబుతున్నామా?

**– విజె డెస్క్**

బైబిల్ స్టడీ

# క్రీస్తు మనసు - సహవాసంలో ఐక్యత



**ఫిలిప్పీ 2:1-11**

తండ్రి దగ్గరకు కుమారుడు వచ్చి "నాన్న నాకు, చెల్లికి అన్నీ ఇచ్చేశావు మరి నీకేమీ లేవని బాధపడుతున్నావా?" అని అడిగితే ఆ తండ్రి చిన్నగా నవ్వి ఎంతో సంతృప్తితో "మీకు అన్నీ ఇచ్చేసినా కూడా "నేను నేనే కదా" అని అంటాడు. ఆదిసంభూతుడు, అనంతుడైన క్రీస్తు మానవాళిని ప్రేమించి, తన కంటే, పసుల కంటే ప్రతి మానవుని యోగ్యునిగా ఎంచి తన స్థితిని, హోదాను, ఆధిక్యతలను పక్కన పెట్టి, రిక్తుడిగా చేసుకొని, మానవునిగా, దాసునిగా జన్మించి, పరిశుద్ధంగా జీవించి, ఘోరమైన, శాపగ్రస్తమైన సిలువ మరణం పొంది మనం కోల్పోయిన, పోగొట్టుకొన్న స్థితిని, సంబంధాన్ని మరలా ఇచ్చారు.

ఈ విధంగా వినయంతో స్వయం సమృద్ధి కలిగిన, దైవ మానవుడైన యేసు మానవుని ప్రేమించి తండ్రికి తనను తాను విధేయతతో అప్పగించుకొన్నాడు. ఈ మనసు కలిగిన ప్రభువు మనకెంతో మాదిరి. తద్వారా తన దైవత్వాన్ని అనుమానిస్తారని, అవమానిస్తారని తెలిసి కూడా గుర్తింపు కోసం ప్రాకులాడలేదు, మనుషుల మెప్పుకోసం జీవించలేదు, ప్రతి చోట నిరూపించుకోవడానికి అసలు ప్రయత్నించలేదు.

**నేపథ్యం:** క్రీస్తు నిమిత్తం, సువార్త నిమిత్తం చెరసాలలో బందీగా ఉన్న పౌలు ప్రభువులో ఆనందిస్తూ రెండవ మిషనరీ ప్రయాణంలో యూరప్ ఖండంలో స్థాపించిన మొదటి సంఘమైన ఫిలిప్పీ సంఘానికి ఉత్తరం రాస్తూ అకారణంగా తోటి వారిని ద్వేషించక, ఇతరుల మెప్పు కోసం, పోటీ తత్వంతో కాక ప్రతి వ్యక్తిని నీకంటే యోగ్యునిగా, విలువైన వానిగా ఎంచుకోవాలని, వైఖరిలో, క్రియలలో కూడా తోటి వారికి ప్రాధాన్యత ఇస్తూ సహవాసంలో ఎంతో ప్రాముఖ్యమైన ఏక మనసు, ఐక్యత కొరకు పాటుపడాలని తెలియజేశాడు. ఇందుకుగాను త్రియేక దేవుడు పౌలుకు తెలియజేసిన సర్వపరిపూర్ణుడైన, మహోన్నతుడైన యేసు యొక్క మనసు/వైఖరి అందరికి మాదిరిగా ఉండాలని స్పష్టంగా వివరించాడు.

## ప్రశ్నలు

1. ప్రస్తుత సంఘం, సహవాసంలో వేటి మీద ఎక్కువ దృష్టిని కేంద్రీకరిస్తున్నారు? ఎందుకు? సహవాసంలో ప్రాముఖ్యమైనవి ఏంటి? ఎందుకు?
2. ఏకమనసు కలిగి జీవించడం అంటే ఏంటి? ఐక్యత ఎందుకు కలిగి ఉండాలి? ఏమి ఉంటే ఐక్యతను కలిగి ఉండగలమని పౌలు బోధిస్తున్నాడు?(1,2)
3. తోటి వ్యక్తిని యోగ్యునిగా ఎంచడంలో అడ్డు వచ్చేవి ఏంటి? ఎందుకు?(3,4) తోటి వ్యక్తిని యోగ్యునిగా ఎంచితే కలిగే ఫలితాలు ఏంటి?(2)
4. క్రీస్తుయేసు ఎలాంటి మనసు/వైఖరి కలిగి ఉన్నాడని పౌలు రాస్తున్నాడు?(5-8)
5. రిక్తునిగా చేసుకోవడం అంటే ఏంటి? క్రీస్తు ఎందుకు రిక్తునిగా చేసుకొన్నాడు?(6-8)
6. ఆయన వైఖరి, మన వైఖరిని ఎలా సవాలు చేస్తుంది?
7. క్రీస్తు మాదిరి నుండి ఏ లక్షణాలను నేర్చుకోగలం? క్రీస్తు మాదిరి నిన్ను ఏ విధంగా పురికొల్పి, ప్రోత్సహించి, హెచ్చరించి, సవాలు చేస్తుంది?
8. కుమారుని విధేయత చూసి తండ్రి అయిన దేవుడు కుమారుని ఏవిధంగా ఘనపరుస్తున్నాడు? (9-11)
9. సహవాసంలో ఐక్యత లోపించిందని ఎలా గుర్తించగలం? యేసు మనసును కలిగి జీవిస్తున్న వ్యక్తి సహవాసం, సమాజంపై ఎలాంటి ప్రభావాన్ని చూపించగలడు?
10. ఇటీవల కాలంలో సహవాసంలో ఐక్యతను పెంపొందించడానికి నీవు చేసిన ప్రయత్నాలు ఏంటి? అందుకు ఎదురైన ఆటంకాలు ఏంటి? వాటిని అధిగమించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేశావు? ఎటువంటి ప్రయత్నాలు చేస్తే మంచి ఫలితాలను చూడగలము?

మన పట్ల, దేవుని పట్ల మన వైఖరిని సిలువ విప్లవాత్మకంగా మారుస్తుంది - జాన్‌స్టాట్

**- తబిత రాజ్ కుమార్,** స్టాఫ్, తిరుపతి



# సుఖవలయాన్ని వదలి వెళ్ళడం

నాకు 2004 సం॥లో వివాహమైంది. హైదరాబాద్‌లోని సైదాబాద్ జోన్‌లో కుటుంబంగా పరిచర్యలో పాల్గొంటూ, సంతోషంగా జీవిస్తూ ఉన్నాము. యుఇయస్ఐ-ఏపి రాష్ట్ర కమిటీలో కూడా నేను సభ్యునిగా ఉన్నాను. నా భార్య ఫీబే ఒక పాఠశాలలో పని చేస్తూ విద్యార్థినీలకు రెండు బైబిల్ స్టడీస్ తీసుకొనేవారు. మా ఇంట్లో కూడా ఒక బైబిల్ స్టడీ జరిగేది. మా అమ్మ కూడా మాతోనే ఉంటూ పరిచర్యలో సంతోషంగా సహకరించేవారు. నేను ఇబ్రహీంపట్నంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తుండేవాడిని. "చురుకైన గ్రాడ్యుయేట్" అని చెప్పేందుకు అది ఒక ఆదర్శవంతమైన జీవితంగా ఉండేది. 2006లో యుఇయస్ఐ-ఏపి ఎగ్జిక్యూటివ్ కమిటీలో సెక్రటరీగా పని చేయమని రాష్ట్ర నాయకత్వం నన్ను కోరారు. అయితే, ఉత్తరాఖండ్‌లోని రూర్కీకు టెంట్‌మేకర్స్‌గా వెళ్ళమని దేవుడు మాకు తెలియజేశాడు.

2012 సం॥లో ఉత్తరాఖండ్ రాష్ట్ర ఇజియఫ్‌కు నేను ప్రెసిడెంట్ అయ్యాను. డెహ్రాడూన్‌లోని ఒక యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాను. మా పాపకు అప్పుడు వయసు 4 సం॥లు. టీచర్‌గా పని చేయాలనే ఉద్దేశంతో ఫీబే బి.ఇడి చదువుతుంది. ప్రేయర్ వాక్స్, ఇవాంజలిస్టిక్ రిట్రీట్ కోసం అనేక ప్రాంతాలను మేము దర్శించేవారం. విద్యార్థుల మధ్య పరిచర్య కోసం అనేక స్థలాల్లో దేవుడు ద్వారాల ను తెరిచాడు. మా ప్రార్థనలకు దేవుడు జవాబు ఇస్తున్నాడని మేము ఎంతో ఆనందించేవారం, పురికొల్పబడ్డాం. అనేక ప్రదేశాలలో పరిచర్యను ప్రారంభించడానికి అనేకమైన ప్రణాళికలను, కార్యక్రమాలను మేము ప్రణాళిక వేసుకొన్నాము. 2013-14 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరిచర్య కార్యక్రమాలను అన్ని రీజియన్‌ల కోసం ప్రణాళిక వేసి, ఒక వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేశాం. అయితే, జూలై 2013లో దేవుడు మమ్మల్ని జైపూర్‌కు తీసుకెళ్ళారు.

ఈ రెండు సందర్భాలలో, మాకు తెలియని కొత్త ప్రాంతాలకు వెళ్ళడానికి, మా సుఖవలయాల ను వదిలి వెళ్ళడానికి దేవుడు మా కుటుంబాన్ని సిద్ధపరచాడు. హైదరాబాద్, ఉత్తరాఖండ్‌లతో మాకు ఎంతో అనుబంధం ఉంది. అక్కడ మా జీవితం, పరిచర్య ఎంతో సంతోషంగా ఉండేవి. అయితే, దేవుని ప్రణాళికలు భిన్నంగా ఉన్నాయి. పరిచర్య అవసరత ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు దేవుడు మమ్మల్ని తీసుకెళ్ళాడు. 2006 సం॥లో ఉత్తర భారత దేశానికి వెళ్ళడానికి మేము ఇష్టపడి ప్రార్థిస్తూ ఉన్నాము. 2006లో మిషన్స్ అంశంతో రాజమండ్రిలో జరిగిన ట్రైకాన్‌లో దేవుడు మాతో మాట్లాడాడు. టెంట్‌మేకర్స్‌గా మమ్మల్ని మేము సమర్పించుకున్నాము. రెండవ సందర్భంలో, 2012 సం॥లో, నేను పని చేస్తున్న విశ్వవిద్యాలయంలో దేవుడు ఒక అనుకూలమైన పరిస్థితిని కలుగజేసి డెహ్రాడూన్ నుండి జైపూర్‌కు మమ్మల్ని పంపించాడు. మేము చాలా అయిష్టంగా బయలుదేరాము. అయితే, దీని వెనుక దేవునికి ఒక ప్రణాళిక ఉందని తర్వాత గుర్తించాం.

## సుఖవలయం అంటే ఏంటి?

మనకు సుఖము, భద్రత ఉన్న ప్రాంతాన్ని సుఖవలయం అంటారు. ఆంగ్లములోని 'కంఫర్ట్‌జోన్' అనే మాటను జుడిత్ బార్డ్‌విక్ రూపొందించి, ఈ విధంగా నిర్వచించారు. "ఎలాంటి ఆందోళనలేని, మితంగా ప్రవర్తిస్తూ, నిలకడగా పని చేస్తూ, ఎలాంటి ఆపద, అపాయం రాని సాధారణ స్థితిలో జీవించే జీవిత విధానం". మనం దేని గూర్చి ఆందోళన చెందాల్సిన అవసరం రాని, ఒకే రకమైన దినచర్య, బాగా తెలిసిన ప్రజల మధ్యే ఉండే జీవిత విధానం ఇది.

## సుఖవలయం నుండి బయటకు రావాలంటే..

### 1. క్రీస్తుకు నీ హృదయాన్ని ఇవ్వాలి

ఒక గొప్ప మార్పుతో మన క్రైస్తవ జీవితం ప్రారంభమౌతుంది. మన ప్రభువైన యేసుక్రీస్తును మన హృదయాలలోనికి ఆహ్వానించాము. అపవాది పక్షము నుండి దేవుని పక్షానికి మారాము. యేసయ్య మన హృదయంలోకి వచ్చిన తర్వాత సాతాను బయటికి వెళ్ళిపోయాడు. వెంటనే బయటి నుండి మనకు ఎంతో వ్యతిరేకత ఎదురౌతుంది. సాతాను సంతోషంగా ఉండడు. మన మీద పడి మనల్ని మింగి వేయడానికి అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటాడు. మనం చేయాల్సిన మరొక ప్రాముఖ్యమైన పని కూడా ఉన్నది. యేసయ్య మన హృదయ వాకిట నిల్చొని తట్టుచూ ఉన్నాడు. మనం ఆయన స్వరాన్ని విని, తలుపు తీసేంత వరకూ తడుతూనే ఉంటాడు (ప్రక 3:20). మన హృదయపు తలుపును తెరవడం అంటే అర్థం ఏంటి? మన ఇష్టాన్ని, చిత్తాన్ని ఆయనకు లోబరచి, ఆయన ఆధీనంలో జీవించడం, మనం ఈ పని చేసిన క్షణంలోనే పరిశుద్ధాత్మ దేవుడు మనల్ని నింపుతారు (ఎఫెసీ 5:18). దేవుని పరిశుద్ధాత్మను మరి ఎక్కువగా పొందుతాము అని కాదు దీని అర్థం. ఆయన మన జీవితాన్ని ఇంకా ఎక్కువగా తన ఆధీనంలోకి తీసుకొంటాడు. సుఖవలయం నుండి బయటకు రావడానికి మొదటి మెట్టు ఇది.

### 2. క్రీస్తు శిష్యునిగా జీవించాలి

ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా జీవించడం తప్ప మనకు మరొక అవకాశం లేదు. క్రైస్తవ జీవితం విశ్వాసుల నుండి కోరుకొంటుంది ఇదే. స్పష్టమైన ఈ మూడు నిర్ణయాలు మనం తీసుకోవాలి అనే సవాలు మన మీద ఉన్నది. మనల్ని మనం ఉపేక్షించుకోవడం, మన సిలువను ఎత్తుకోవడం, యేసుక్రీస్తును వెంబడించడం (లూకా 9:23). శిష్యత్వానికి సంబంధించిన ఈ మూడు లక్షణాలు సుఖవలయం నుండి బయటకు రావడానికి సంబంధించినవి.

#### ఎ) మనల్ని మనం ఉపేక్షించుకోవడం

మనల్ని మనం ఉపేక్షించుకోవడం అంటే, మనకు బాగా నచ్చిన వాటిని వదులుకోవడం. క్రీస్తుతో కలిసి మనం వెళ్ళే మార్గంలో ఆటంకంగా ఉన్న వాటన్నిటినీ, అవి ఎంత మంచివైనా సరే, విడిచిపెట్టాలి. మనకు బాగా ఇష్టమైన వ్యక్తి అయి ఉండవచ్చు, ఎంతో తీవ్రతతో పట్టుదలతో సాధించాలని మనం ఏర్పరచుకున్న ఒక కెరీర్ లక్ష్యం అయి ఉండవచ్చు. దేవుని చిత్తానికి మన చిత్తాన్ని లోబరచినప్పుడు (మత్తయి 26:39), మన సుఖవలయాన్ని మనం చెదరగొడతాము. ఈ నిర్ణయం ఒక సాధారణమైన జీవితంలో నుండి మనల్ని బయటకు తీసుకెళ్ళి, ప్రకృతికి అతీతమైన ఒక ఆధ్యాత్మిక పరిస్థితిలోనికి నడిపిస్తుంది. ఇలాంటి పరిస్థితి కేవలం ఒక క్రైస్తవ విశ్వాసికి మాత్రమే అర్థమవుతుంది. డబ్బును లేదా ప్రజలను కోల్పోవచ్చు. గాని, గొప్ప ఆత్మీయ సంపదను సంపాదించుకొంటాము. ఇతర మత విశ్వాస నేపథ్యం నుండి ప్రభువును విశ్వసించి, గొప్ప వెలను చెల్లించిన సహోదరులు, సహోదరీలు మనకు ఎంతో మంది తెలుసు. వారు తమ సుఖవలయాన్ని దాటి వచ్చారు.

#### బి) సిలువను ఎత్తుకోవడం

గురువు అడుగుజాడల్లో నడవడమే శిష్యత్వం. మనం మన సిలువను మోయాల్సి ఉంది. క్రీస్తుప్రభువు మేకులతో వేలాడిన చెక్క సిలువ లాంటి సిలువ కాదు మన సిలువ. క్రీస్తు ప్రభువును వెంబడించుట ద్వారా ఎదురయ్యే శ్రమ మన సిలువ. మనం మన స్నేహితులతో సత్యం చెప్పినప్పుడు, ఇహలోక సంబంధమైన సుఖాలలో వారితో కలిసి పాల్గొనడానికి తిరస్కరించినప్పుడు, పరీక్షల్లో కాపీలు కొట్టనందుకు, కాపీలు కొట్టడానికి సహకరించనందుకు, మనం నియమ నిబంధనలను పాటించినప్పుడు, ఎక్కువ ట్రాఫిక్ లేకపోయినా రెడ్ సిగ్నల్ వద్ద ఆగినప్పుడు, స్వబుద్ధి, లోక మర్యాదల

ఒక స్థిరమైన గవర్నమెంట్ ఉద్యోగమో లేక ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగమో చేయాలని ఆశిస్తున్న సమయంలో ఒక మిషనరీగానో లేక ఒక స్టాఫ్ వర్కర్‌గానో ఎందుకు పనిచేయకూడదు అని దేవుడు మనల్ని అడగవచ్చు. అమెరికా లేదా కెనడా లేదా ఆస్ట్రేలియా వంటి దేశాలలో జీవించాలని నీవు ప్రయత్నిస్తున్న సందర్భంలో, 10/40 విండో దేశాలలోనో లేక ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాలకో (హరియాణ, బీహార్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్) వెళ్ళమని దేవుడు నిన్ను కోరవచ్చు.

కన్నా లేఖనాలకు లోబడినప్పుడు మన స్నేహితులు మన పట్ల సంతోషంగా ఉండరు. మన ప్రభువు సువార్తను ఇతరులతో పంచుకొన్నప్పుడు ఎంతో శ్రమ ఎదురవుతుంది. మనం మన సుఖవలయంలో ఉండి, ఎదుగుబొదుగు లేకుండా ఉన్నట్లయితే, మనం స్వార్థపరులమని, సువార్తను ప్రకటించని వారమని అర్థం. సౌవార్తీకరణ యుఇయస్ఐకు పదును. కాబట్టి యుఇయస్ఐ తన సభ్యుల ను ఎప్పుడూ సుఖవలయంలో నుండి బయటకు పంపిస్తుంది. కుటుంబసభ్యుల నుండి ఎడబాటు, ఆర్థిక నష్టం, వివాహంలో ఆలస్యం వంటి సిలువను మన సహవాసంలోని అనేకమంది సహోదరులు, సహోదరీలు భరించారు. దీనంతటికీ కారణం వారు క్రీస్తులో ఉంచిన విశ్వాసమే.

### సి) యేసుక్రీస్తును వెంబడించడం

క్రీస్తును వెంబడించడంలో ఉన్న తర్వాతి మెట్టు ప్రతిదినము సిలువను మోయడం. అయితే, 'నన్ను వెంబడించు' అంటే, క్రీస్తు జీవితాన్ని, జీవనశైలిని ఈ భూమి మీద మనం అనుకరించడం. మనకు ఒక మాదిరిగా ఆయన మన ముందు జీవించారు. మానవజీవితంలో నిజమైన ప్రేమ సంతోషం సమాధానం దీర్ఘశాంతము దయాళుత్వము మంచితనము విశ్వాసము సాత్వికము ఆశానిగ్రహము (గలతీ 5:22-23) వంటి లక్షణాలను కలిగి ఉండడం సాధ్యమే అని ఆయన నిరూపించాడు. తనను సిలువ వేసిన వారిని క్షమించమని ఆయన సిలువపై చేసిన ప్రార్థన మనకు ద్రోహం చేసిన వారి ని మనం క్షమించాలని సవాలు చేస్తుంది. తప్పుడు భావనతో ఉన్న ఇతరులతో సమాధానపడడం చాలా కష్టం. యేసును వెంబడించడం అంటే, ఆయనవలె దీనునిగా ఉండడం. దేవునితో సమానముగా ఉండుట అనే భాగ్యాన్ని విడిచిపెట్టి, తనను తాను రిక్తునిగా చేసుకొని, దాసుని స్వరూపమును ధరించుకొని, సిలువ మరణము పొందునంతగా విధేయత చూపుటకు ఇష్టపడిన దీనుడైన యేసుక్రీస్తు ప్రభువువలె జీవించడం (ఫిలిప్పీ 2:6-8). యేసుక్రీస్తు ప్రభువును మనం హృదయపూర్వకంగా వెంబడిస్తే, సుఖవలయం నుండి మనం బయటకు రావాల్సి ఉంటుంది. అలాగే, ఇతరులను కూడా అసౌకర్యానికి గురి చేస్తూ గొప్ప కదలికను సృష్టించాల్సిన అవసరం కూడా ఉన్నది. మనం గొప్ప గొప్ప విజయాలు సాధించి, పేరు ప్రఖ్యాతులు సంపాదించే వ్యక్తులు గా ఉండాలని దేవుడు కోరడం లేదు. మంచి దైవిక లక్షణాలు కలిగి ఆయనను పోలినవారై ఉండాలని దేవుడు ఆశిస్తున్నాడు. యేసుక్రీస్తు మన జీవితంలో కనిపించి తీరాల్సిందే.

### 3. క్రీస్తువలె సేవక నాయకునిగా ఉండాలి

ప్రభువు శిష్యులుగా ఆధ్యాత్మికతలోను పరిపక్వతలోను ఎదిగినప్పుడు, ఒక సామూహిక బైబిల్‌స్టడీని నడిపించడం లేదా యవ్వన క్రైస్తవుల ను మెంటర్ చేయడం వంటి పనులను మనం చేయాల్సి రావచ్చు. క్రైస్తవ నాయకత్వంను ఈ లోక నాయకత్వంతో పోల్చినప్పుడు అది ఎంతో భిన్న మైనది, విరుద్ధమైనది. ఒకరికొకరు పరిచారకులై ఉండాలని యేసుక్రీస్తు ప్రభువు తన శిష్యులకు తెలియజేశాడు (యోహాను 13:14). నాయకత్వంలో ప్రాముఖ్యమైన అంశం ఎవరు బాస్ అనేది కాదు, ఎవరు సేవకునిగా ఉండడానికి ఇష్టపడుతున్నారు అనే విషయం. ఒక ఆధ్యాత్మిక గురువు తన శిష్యుల పాదాలను కడగడం ఈ రోజుల్లో ఊహించడానికే అసాధ్యంగా కనిపిస్తుంది. మన ప్రభువైన యేసుక్రీస్తు మనకు గొప్ప మాదిరిని చూపించారు. ఆయన సేవ చేయడానికే గాని, సేవ చేయించుకోవడానికి కాదు అని తెలియజేశాడు (మార్కు 10:45). తనను గుద్దిన వారిని, చెంప మీద కొట్టిన వారి

ని, మొహం మీద ఉమ్మివేసిన వారిని కొరడాలతో కొట్టినవారిని, మేకులతో సిలువకు గొట్టిన వారిని క్షమించమని ఆయన తండ్రిని ప్రార్థించినప్పుడు ఆయనలో దీనత్వం కనిపించింది. సంఘంలో లేదా మన పరిచర్యలో నాయకత్వం కోసం ఎంతో పోటీ నెలకొనియున్నది. కానీ, క్రీస్తు దీనత్వాన్ని అనుసరించడానికి చాలా తక్కువ పోటీ లేదా అసలు పోటీనే లేని పరిస్థితులు ఉన్నాయి.

## 4. క్రీస్తు కొరకు ప్రభావాన్ని చూపించాలి

ప్రభావాన్ని చూపగలిగే, తద్వారా సాక్ష్యాన్ని లేవనెత్తగలిగే స్థానాలలో, హోదాలలో తన పిల్లలు ఉండాలని, సువార్తను పంచుకోవడం ద్వారా అనేకమందిని వారు తనతో సమాధానపరచాలని దేవుడు కోరుకొంటున్నాడు. శిష్యత్వం, నాయకత్వం పిలుపుకు లోబడి, దానిని అభ్యసిస్తున్నప్పుడు దేవుడు మనల్ని మన సుఖవలయాల నుండి బయటకు నడిపిస్తాడు. పౌలు తన అనుభవాన్ని పంచుకొంటూ, గతాన్ని మరచిపోయి ముందున్న వాటికోసం వేగిరపడాలని మనల్ని సవాలు చేస్తున్నాడు (ఫిలిప్పీ 3:13). ఈ విషయాన్ని అందరికంటే ముందు గురి యొద్దకు చేరడానికి 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని పరుగెత్తే క్రీడాకారునితో పోల్చవచ్చు. క్రీడాకారుడు గురి సమీపించే కొలది ఎంతో కష్టంతో గెలుపు తాడును తాకడానికి ప్రయాసపడతాడు. మన జీవితంలో ఎన్నడూ ప్రయాణం చేయని ప్రాంతాలకు వెళ్ళడానికి ప్రయత్నించనంతకాలం మన జీవితం సుఖంగా, సురక్షితంగానే ఉంటుంది.

## 5. నిజాయితీగా ప్రార్థించాలి

మనం నిజాయితీగా ప్రార్థించనంతకాలం, మనం మన సుఖవలయాలను దాటిరాలేము. ఎంతో సౌకర్యవంతంగా జీవిస్తూనే ఉంటాము. ఈ రోజుల్లో ఎన్నో ప్రార్థనాంశాలు మనముందుకు వస్తుంటాయి. ప్రజలకు ఓదార్పు ఎంతో అవసరం – రోగాలు, ప్రియులైన కుటుంబసభ్యులను కోల్పోవడం, ఆర్థిక నష్టం, జీతంలో కోత, ఉద్యోగాన్ని కోల్పోవడం, పిల్లలు పుట్టకపోవడం, వివాహం కోసం ఎదురుచూడడం ఇలా ఎన్నో ప్రార్థన అవసరాలు ఉన్నాయి. ఇలాంటి ప్రార్థనా అవసరతలను గూర్చి తెలుసుకోవడానికి నీవు ప్రయత్నించినప్పుడు నీలో భారం కలుగుతుంది. దేవుడు నిన్ను విజ్ఞాపన ప్రార్థనలోనికి నడిపిస్తాడు. నీవు ప్రతిస్పందిస్తావు, పాల్గొంటావు. ఇతరుల జీవితాలలో మనం చొరవ తీసుకోవడం ప్రారంభించినప్పుడు సమయం, ధనం, నిద్ర వంటివి ఎన్నో త్యాగం చేయాల్సి ఉంటుంది. ఇతరుల బాధను తెలుసుకోనంతకాలం మనం వారిపట్ల శ్రద్ధ చూపించలేము. ఆయా వ్యక్తుల మధ్య లేదా ఆయా వ్యక్తులకు దేవునికి మధ్య సమాధానాన్ని కలిగించే క్రమంలో తల్లిదండ్రులతో లేదా పిల్లలతో గడిపే సమయాన్ని మనం కొంత నష్టపోవాల్సి రావచ్చు. ఇతరుల బాధను తగ్గించడానికి కృషి చేసే క్రమంలో మన వనరులను మనం కొంత ఖర్చు చేయాల్సి రావచ్చు. మన ఇంటిలో ఒక ఇయు రిట్రీట్ లేదా బైబిల్‌స్టడీని నిర్వహించాల్సి వచ్చినప్పుడు ఆదివారపు విశ్రాంతిని మనం కోల్పోవాల్సి రావచ్చు. విద్యార్థులను లేదా యువ గ్రాడ్యుయేట్స్‌ను కౌన్సిల్ చేసినప్పుడు మన నిద్రను కూడా కొంత త్యాగం చేయాల్సిరావచ్చు. ఇతర విశ్వాస నేపథ్యాలకు చెందిన వారు ప్రభువును విశ్వసించి, దేవుని కొరకు వారు ఫలిస్తున్నప్పుడు మన త్యాగాలన్నిటినీ మనం మర్చిపోతాము. మనం వారి కోసం ప్రార్థిస్తున్నప్పుడు, దేవుడు మన ప్రార్థనకు జవాబు ఇస్తున్నప్పుడు, ఇంకా ప్రార్థించడానికి మనం పురికొల్పబడతాం. జీవితాలు మారడం మనం చూస్తున్నప్పుడు మన సుఖాలను మరి ఎక్కువగా త్యాగం చేయాలని పురికొల్పబడతాం.

## 6. దేవుని నడిపింపుకు లోబడాలి

దేవుడు మనల్ని భిన్నమైన ప్రాంతాలకు నడిపిస్తాడు. ఉద్యోగంలో మార్పులు, అద్దె ఇల్లు, అన్‌రీచ్డ్ కళాశాల లేదా ప్రాంతం పట్ల భారం మనలో ఆయన కలుగజేస్తాడు. ప్రతీసారి కొత్త పరిస్థితులకు మనం అలవాటుపడాల్సి వస్తుంది. క్రొత్త ప్రాంతంలోని సహ ఉద్యోగులను, పొరుగువారిని, సంఘం, సహవాసంలోని సభ్యులను మనం ప్రభావితం చేయడం పట్ల దేవుని ప్రణాళికలను మనం అర్థం చేసుకొన్నప్పుడు, అలాంటి నిర్ణయాలు తీసుకున్నందుకు మనం ఎంతో ఆనందిస్తాము. మనలో నుండి ఉత్తమమైన దానిని బయటకు తీసుకురావడానికి, అలాంటి పరిస్థితులను దేవుడు మనపై బలవంతంగా రుద్దుతాడు.

ఒక స్థిరమైన గవర్నమెంట్ ఉద్యోగమో లేక ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగమో చేయాలని ఆశిస్తున్న సమయంలో ఒక మిషనరీగానో లేక ఒక స్టాఫ్ వర్కర్‌గానో ఎందుకు పని చేయకూడదు అని





దేవుడు మనల్ని అడగవచ్చు. అమెరికా లేదా కెనడా లేదా ఆస్ట్రేలియా వంటి దేశాలలో జీవించాలని నీవు ప్రయత్నిస్తున్న సందర్భంలో, 10/40 విండో దేశాలలోనో లేక ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాల కో (హరియాణ, బీహార్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్) వెళ్ళమని దేవుడు నిన్ను కోరవచ్చు. దేవునికి నీ జీవితం పట్ల ఒక ప్రణాళిక ఉన్నది. సాధ్యమైనంత ఎక్కువగా ప్రభావితం చేయగలిగే ప్రదేశంలో నీవు ఉండాలని దేవుడు కోరుచున్నాడు. క్రొత్త సాంప్రదాయాలకు, సంస్కృతికి, ప్రదేశాలకు, భాషకు, పరిచర్య విధానానికి, సంఘ క్రమాలకు అలవాటుపడాలి.

### 7. సుఖవలయాన్ని దాటడానికి నీవు సిద్ధమేనా?

మోషే, ఎస్తేరు, రూతు, దానియేలు, హోషేయ, నెహెమ్యా, పౌలు, పేతురు, తోమా వంటి అనేకమంది బైబిల్ నాయకులు తమ సుఖవలయాల నుండి బయటకు రావడానికి నిర్ణయం తీసుకున్నారు. వారి నిర్ణయం ఎలా ప్రభావితం చేసిందో మనకు తెలుసు. లేఖన సత్యాలకు అనుగుణంగా జీవిస్తూ, ఆ వారసత్వాన్ని తర్వాతి వారికి వారసత్వంగా ఇవ్వాలనే తీర్మానం తీసుకున్న ప్రొ. హెచ్. ఇనాక్, వంటి యుఇయస్ఐ పితరులను బట్టి దేవునికి వందనాలు. తమ సుఖవలయాలను దాటి రావడం ద్వారా తామేదో అసాధారణమైన పని చేస్తున్నామని వారు భావించలేదు. సాధారణ క్రైస్తవ జీవితాన్ని మాత్రమే తాము జీవిస్తున్నామని వారు భావించుకొన్నారు. మనం అలా భావించుకోగలమా? సుఖవలయాలను దాటి, సాధారణ క్రైస్తవ జీవితాన్ని జీవించడానికి మనం సిద్ధంగా ఉన్నామా?

**– పిల్లి ఇమ్మానియేల్ శుభాకర్,** జైపూర్


## యుఇయస్ఐ -ఏపి క్యాలెండర్ - 2025



**ఆకర్షణీయమైన 2025 క్యాలెండర్స్ నంబూరు ఆఫీస్‌లో సిద్ధంగా ఉన్నాయి.**
**కావలసినవారు త్వరపడండి, ఆర్డరు చేసుకొండి.**

**బ్ర. ఆడం – (8247728374)** సెక్రటరీ, యుఇయస్ఐ పబ్లికేషన్ ట్రస్ట్ – ఏపి బ్రాంచ్
**బ్ర. పి. జగదీష్ – (9493240435) ను సంప్రదించండి.**

ప్రత్యేకం

# అవతల ఒడ్డు...

## ఓ అద్భుతమైన అవకాశం



అది గలిలయ సముద్ర తీర ప్రాంతము. సముద్రపు నీళ్ళను తాకుతున్న సూర్యకిరణాలు, ఎగిసిపడుతున్న అలలు, చేపలు పట్టడానికి దోనెలు, వలలతో సిద్ధమవుతున్న జాలరులు, జాలరులతో పాటు దోనెల్లో వెళ్తామని మారాం చేస్తున్న చిన్నపిల్లలు, ఇవేమి తమకు పట్టవన్నట్లు ఆటలు ఆడుకుంటున్న మరికొంతమంది పిల్లలు..ఇక్కడ వాతావరణం అంతా చూడముచ్చటగా, ఆహ్లాదంగా ఉంది.

ప్రభువైన యేసుక్రీస్తు అక్కడి దోనెల్లోని ఒక దోనెలో కూర్చొని, బోధించడానికి సిద్ధమయ్యాడు. కొద్ది సేపటికే, ఆయన బోధలు వినడానికి ప్రతి పట్టణం, గ్రామం నుంచి వచ్చిన జనసమూహంతో ఆ తీర ప్రాంతమంతా కిక్కిరిసిపోయింది.

ఇంతలో ప్రభువైన యేసుక్రీస్తు "విత్తువాని ఉపమానం"తో తన బోధను ప్రారంభించారు (మత్తయి 13:18-23; మార్కు 4:1-20; లూకా 8:4-15). ఎంతో చక్కగా అనేక పరలోకపు విషయాలను ఉపమానాలతో బోధిస్తున్నాడు.

అవి పన్నెండు మంది శిష్యులకు ప్రారంభ దినాలు (మార్కు 3:13). వారిని శిష్యులుగా ఏర్పాటు చేసుకోవడం, తనతో ఉండడానికి, తనవలె జీవించడానికి ప్రభువు వారిని పిలుచుకున్న తొలిదినాలు. అలాంటి తొలిదినాలలో బహు జనసమూహం మీటింగ్స్‌కి రావడం, అర్థం కానివి వ్యక్తిగతంగా అడగడం, ఇలా "అంతా బాగుంది" అన్నట్లుగా ఆనందపడుతున్నారు. ఆయన బోధించడం ఆపేసిన తర్వాత, 'అవతల ఒడ్డునకు వెళదాము' అనే మాట వారికి విన్పించింది.

ఇక్కడ 'అంతా బాగుంది' కదా అని అనుకుంటున్న సమయంలో, 'అవతల ఒడ్డు'కు వెళ్దాము అనే మాటతో శిష్యులు కొంత కలవరానికి లోనైనా, ఇవతలవైపు కంటే 'అవతల ఒడ్డు'న రెట్టింపు ఆశీర్వాదం ఉంటుందేమో అనే అంచనాతో ఉన్నారు. ఆ అంచనాలతో శిష్యులు ప్రయాణం సాగిస్తున్న సమయంలో, ప్రయాణం మధ్యలో గాలివాన, పెద్ద తుఫానుగా మారింది. అలల మధ్యలో అల్లాడిపోతున్న దోనె, నీటితో నిండి మునిగిపోసాగింది.

బహుశా శిష్యులందరి మదిలో అన్ని సౌఖ్యాలను, సుఖాలను వదిలిపెట్టి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తూ "అవతల ఒడ్డున" ఆయనను ఆకర్షించింది ఏంటి? అనే ప్రశ్నతో ఉక్కిరిబిక్కిరవుతూ, 'బోధకుడా, నీకు చింత లేదా' అని ఆయనను అడిగి ఉంటారు. అయితే ఆయన తుఫానును గద్దించగానే అది నిమ్మళించడం, వారి అవిశ్వాసాన్ని ప్రశ్నించడం, వారిని చాలా లోతైన ఆత్మీయ అనుభవంలోనికి తీసుకొని వెళ్ళడం మనం గమనించగలం.

ఇంతకీ ఆయనను ఆకర్షించినది ఎవరు? ఏంటి? అనే సంగతులు మనం ఆలోచన చేయాలి.

### 'అవతల ఒడ్డు'న ఆయనను ఆకర్షించింది ఏంటి?

గలిలయ సముద్ర తీరమున 'అవతల ఒడ్డు'న గెరాసేనీయుల దేశం ఉంది. మన ప్రభువు అక్కడి ప్రజలను, పరిస్థితులను బాగుగా ఎరిగినవాడు. అక్కడి నుండి తనను వెళ్ళిపొమ్మంటారని కూడా తెలిసినవాడు. అలాంటి దేశములో అపవిత్రాత్మలు పట్టిన "ఒక్కడు" ఆయనను ఆకర్షించాడు. బహు జనసమూహం, తల్లి, సహోదరులను పక్కన పెట్టి, అనామకుడు, ఏమాత్రం ఆకర్షణీయంగా లేని వ్యక్తి కోసం ఆయన రావడం శిష్యులకు షాకింగ్‌గా అన్పించి ఉండవచ్చు. అపవిత్రాత్మలు పట్టిన వ్యక్తిని గమనిస్తే, దాదాపుగా అనేక దెయ్యాల ఆధీనంలో ఉన్నాడు. సిగ్గు తెలియక సరిగా బట్టలు కట్టుకోలేని స్థితిలో ఉన్నాడు. రాత్రిపగలు ఏమాత్రం ఇంటిలో ఉండడానికి ఇష్టపడక సమాధులలోనే ఉండేవాడు. కేకలు వేసుకొంటూ, తననుతాను రక్తం కారేటట్లు గాయపరచుకొంటూ దుర్భరమైన అపవిత్రాత్మలతో జీవిస్తున్నాడు. చాలాసార్లు చాలామందితో పాటు ఇనుప గొలుసులు కూడా తనను కంట్రోల్ చేయలేకపోయేవి.

ప్రభువైన యేసు ఆ వ్యక్తి భయంకరమైన, దుర్భరమైన జీవితాన్ని బాగు చేశాడు. అంత భయంకరమైన పరిస్థితులలో ఉన్న వ్యక్తి కోసం

సుఖాన్ని, జనసమూహాన్ని వదిలిపెట్టి ప్రాణాలను, వ్యతిరేకతను లెక్క చేయకుండా వచ్చి బాగుచేసి వెళ్ళిపోవడం మనల్ని సవాలు చేస్తుంది.

ఈ క్రిస్మస్ రోజులలో మనం కన్నులెత్తి చూస్తే అవతలి ఒడ్డున చాలామంది విద్యార్థులు ఇతనివలె కన్పిస్తారు. "అతను దెయ్యం పట్టి అలా ప్రవర్తిస్తే, ఈ రోజులలో కాలేజి విద్యార్థులు పాపం వలన అంతకంటే భయంకరంగా ప్రవర్తిస్తున్నారు".

**బట్టలు సరిగా కట్టుకోలేని స్థితి:** అనేకమంది విద్యార్థులు సిగ్గు లేకుండా ఎంత ఎక్స్‌పోజింగ్ చెయ్యగల్గితే అంత క్రేజ్, కిక్ అన్నట్లుగా, బట్టలు సరిగా కట్టుకోవడానికి ఇష్టపడక, ఎక్స్‌పోజింగ్‌కే పట్టం కడుతున్నారు.

**ఉండకూడని స్థలాల్లో ఉండడం:** తాము ఉండాల్సినచోట ఉండక, ఉండకూడని చోటులలో ఉంటూ, వెలుగులో ఉండక, స్మార్ట్‌ఫోన్ వెలుతురనే చీకటిలో ఉంటూ అపవిత్రాత్మకు, అశ్లీలతకు తమ్మునుతాము అమ్ముకుంటున్న నవభారత పౌరులను మనం చూడగలం.

**తమను తాము గాయపరచుకోవడం:** విద్యార్థులు, తమ ఇష్టాలతో, కోరికలతో, ఆశలతో, తమ్మునుతాము పాడు చేసుకుంటూ, ఆల్కహాల్, సిగరెట్, సినిమాలు, షికార్లు, డ్రగ్స్, మందు, మత్తుమందులతో తమ్మునుతామే గాయపరచుకుంటూ మత్తులో, మైకంలో తూలిపోతున్నారు.

**అదుపులేని జీవితం:** ఎవరి మాటా వినడానికి, ఎవరి ఆధీనములో ఉండడానికి ఇష్టంలేక, వారికి నచ్చినట్లు, నచ్చిన వారితో తిరుగుతూ నచ్చినవి చేస్తూ, నచ్చినవి తింటూ, 'నా ఇష్టం' అంటూ నానా యాగీ చేస్తున్న విద్యార్థులను మనం చూడగలము.

**కృంగిపోవడం:** విలువలను నిలువునా ముంచి, నెట్‌తో నలిగిపోతూ, అశ్లీలతతో సేదతీరుతూ, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో ధనాన్ని వృథా చేస్తూ, ఛాటింగ్‌లతో, బ్రౌజింగ్‌లతో బిజీగా ఉంటూ, "గతం యొక్క అపరాధ భావాన్ని, వర్తమానం యొక్క అదుపు చేయలేని జీవితాన్ని, భవిష్యత్తు యొక్క అర్థంకాని భయాన్ని" భరిస్తూ, పైకి నవ్వుతూ, లోపల కుమిలిపోతూ, కృంగిపోతున్న విద్యార్థులను మనం చూడగలము.

**నవ్వుతూ నరకానికి వెళ్ళడం:** ప్రేమ పేరుతో హత్యలు, ఆత్మహత్యలు, కాముకత్వంతో కళ్ళు మూసుకొని, అత్యాచారాలు, సరదాల కోసం, సుఖాల కోసం, దొంగతనాలు, అక్రమ సంబంధాలు, అక్రమ సంపాదనలు, అబద్ధాలు ఆడడం, తల్లిదండ్రులను మోసం చేయడం, బూతులు మాట్లాడడం, బూతు వీడియోలు, బూతు బొమ్మలు చూడడం, పెళ్ళికి ముందే శారీరక సంబంధాలు... ఇలా చెప్పుకొంటూపోతే ఎన్నో, ఎన్నెన్నో (అపవిత్రాత్మ పట్టిన వ్యక్తిని మించిపోతారు). ఒక్క మాటలో చెప్పాలంటే "నవ్వుకుంటూ నరకానికి వెళ్తున్న విద్యార్థులు" మన కళ్ళ ముందు కన్పిస్తారు.

దాదాపు 2024 సం॥ముల క్రితం యేసుక్రీస్తు ప్రభువు పాపులమైన మన కోసం సింహాసనం వదిలిపెట్టి పశువుల తొట్టిలోనికి వచ్చాడు. కెరూబులు, సెరూపుల స్తుతులను, సర్వాధికారాన్ని వదిలి, అవమానాల్ని, హేళనల్ని భరించడానికి వచ్చాడు. "అన్నిటిని వదిలిపెట్టి... అవతల ఒడ్డున ఉన్న మనకోసం మానవుడిగా ఈ లోకానికి వచ్చాడు". ఎంత ప్రేమ గల దేవుడు. ఇదే క్రిస్మస్.... ఈ క్రిస్మస్ రోజులలో "అవతల ఒడ్డు"నకు వెళ్ళదము అనే ఆజ్ఞ మన జీవితాలలో నెరవేరాలి.

మన రక్షణ తొలిదినాలను జ్ఞాపకం చేసుకుంటూ 'అవతల ఒడ్డు'న అపవిత్రమైన జీవితంతో ఉన్న మనకి రక్షకుని గురించి చెప్పడానికి మన కోసం వచ్చిన అన్నను/అక్కను గుర్తు చేసుకుందాము, మనకు వారిచ్చిన కరపత్రికను గుర్తు చేసుకుందాం, మన కోసం ఏర్పాటు చేసిన క్రిస్మస్ మీటింగ్, మనల్ని బతిమాలి క్యాంప్‌కు, రిట్రీట్‌కు తీసుకెళ్ళిన విధానాన్ని జ్ఞాపకం చేసుకుందాము. మన కోసం వారు చేసిన ప్రార్థనలు, ప్రసంగాలను, ప్రయాసలను గుర్తు చేసుకుంటే మనం 'మౌనం'గా ఎలా ఉండగలం?

కోతెంతో విస్తారము, పనివారు బహుకొంచెము... మీ కన్నులను పైకెత్తి చూడుడి (విద్యార్థులను చూడుడి) అవి ఇప్పుడు తెల్లబడి ఉన్నవి. క్రిస్మస్ అద్భుతమైన అవకాశం. సువార్తను అందించడానికి సువర్ణ అవకాశం.

అయితే 'అవతల ఒడ్డు'నకు వెళ్ళడానికి ఆటంకమేంటి? ఆలోచించుకొందాం... ఆయన మాదిరిని అనుసరిద్దాం. సుఖాలను, సౌఖ్యాలను వదిలిపెట్టడానికి ఇష్టపడదాం.

క్రిస్మస్ శుభాకాంక్షలతో...

**– యం. గాలెయ్య,** భీమవరం

# చల్లా చల్లని గాలి తెమ్మెర...

"చల్లా చల్లని గాలి తెమ్మెర హో...హో...హో...
కొండ కోనల్లో ఝుమ్మని పాడగ
మెల్ల మెల్లగ పారే సెలయేరు
పరవళ్ళు తొక్కుచూ ఉప్పొంగి ఆడగ
పుడమి తనువు పులకించింది
ఇలలో యేసురాజు పుట్టెనని"

ఇదొక ఫోక్ సాంగ్. క్రిస్మస్ సమయంలో ప్రతి ఒక్కరూ పాడుకొనే పాట. ఈ పాట రచన, స్వర కల్పన, సంగీతం సమకూర్పు **శ్రీ జి. పీటర్ శ్రీకాంత్** గారు చేశారు. 1990వ సంవత్సరం బహుశా నవంబరు/డిసెంబర్ నెలలో ఈ పాటను రచించి, డిసెంబర్ నెలలో గుంటూరు ఆంధ్రా క్రిష్టియన్ కాలేజ్‌లో జరిగిన కమ్యూనిటీ క్రిస్మస్‌లో శ్రీకాంత్ గారు చర్చ్ యూత్‌తో కలిసి పాడడం జరిగింది. 1991లో "శాంతి సంగీతం" కేసెట్‌లో గ్రూప్‌తో కలసి వారు పాడారు. ఈ కేసెట్‌ను వైజాగ్ ఇయు వారు రికార్డింగ్ చేశారు.

## ఈ పాట నేపథ్యం

గుంటూరు లూథరన్ చర్చ్ నార్త్ ప్యారిష్ యూత్ బైబిల్ స్టడీలో జి. మార్టిన్ అనే సోదరుడు, శ్రీకాంత్ గారు చాలా సన్నిహితంగా వుండేవారు. కలసి సమయం గడుపుతూ ఉండేవారు. మార్టిన్ గారు ఫ్లూట్ బాగా వాయించే వారు. 1990 నవంబర్ నెలలో శ్రీకాంత్ గారు ఇంట్లో కూర్చుని పిచ్చాపాటిగా గిటార్ వాయిస్తుంటే, మార్టిన్ గారు ఫ్లూట్ వాయిస్తున్నారు. ఆ సమయంలో ఒక రాగం శ్రీకాంత్ గారి మనసులోకి వచ్చింది. ఆ రాగాన్ని ఆధారం చేసుకొని సాహిత్యం, స్వర కల్పన చేశారు.

ఈ పాట లిరిక్స్‌కి ప్రేరణ యెషయా గ్రంథము 35 వ అధ్యాయం 1-2 వచనాలు, అలాగే 6-7 వచనాలు; అలాగే రోమీయులకు రాసిన పత్రిక 8వ అధ్యాయం 19 నుండి 22 వచనాలు. ఈ పాటలోని సాహిత్యమంతా శ్రీకాంత్ గారి క్వైట్‌టైమ్, వ్యక్తిగత బైబిల్ ధ్యానం, క్యాంప్‌లలో నేర్చుకొన్న డాక్ట్రిన్స్ నుండి వచ్చినదే.

## వివరణ

ఈ పాటలో యేసుక్రీస్తు యొక్క మొదటి ఆగమనం, రెండవ ఆగమనం మనము స్పష్టంగా గమనించగలము. యేసు క్రీస్తు ఈ లోకములో జన్మించినప్పుడు కొండకోనల్లో చల్లని గాలి ఒక్కసారిగా తెరలు తెరలుగా వీచింది. సెలయేర్లు ఉరకలు వేస్తూ ప్రవహించాయి. సృష్టి యావత్తు ఉల్లసించి పాడింది, ఈ భూమి పులకించిపోయింది. ఎందుకంటే దేవుడు ఆదాముని, హవ్వని శపించినప్పుడు ఈ నేలను కూడా శపించాడు. ఈ సృష్టి యావత్తు శాపానికి గురైంది. కాబట్టి యేసుక్రీస్తు ద్వారా మానవుల పాప విమోచనతోపాటు, సృష్టికి కూడా శాప విమోచన కలుగుతుందని ఈ సృష్టి కూడా ఉల్లసించి పాడుతుంది. ఇది అలంకారప్రాయంగా రాసినపాట. ప్రతి వచనంలో కూడా సృష్టి సంతోషించడం గమనార్హం. క్రీస్తు ఈ సృష్టిని విమోచించి, ఈ భూమిని నీతి న్యాయములతో పరిపాలన చేయబోతున్నాడు అందుకే సృష్టి పాడుతుంది.

మొదటి వచనంలో క్రీస్తు పుట్టుక, రక్షణ సిద్ధాంతం, రెండవ వచనంలో యేసుక్రీస్తు మరణ పునరుత్థానాలు, మూడవ వచనంలో యేసుక్రీస్తు రెండవ రాకడ, పరిపాలనను గమనించవచ్చు.

*గుంటూరు వాస్తవ్యులైన **జి. పీటర్ శ్రీకాంత్** గారు యంఏ, యంఇడి చదివి కేంద్రీయ విద్యాలయంలో టిజిటి ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరు 1984లో యేసుప్రభువును రక్షకునిగా అంగీకరించి ఇయు, ఇజియఫ్, పాటల పరిచర్యలో చురుకుగా పాల్గొన్నారు. వీరి సతీమణి సుసన్న రమ్య స్మిత. వీరు ఏపియస్‌డబ్ల్యు రెసిడెన్సియల్ కాలేజ్‌లో జేయల్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరికి ఇద్దరు కుమార్తెలు జి ఏ జెరూష థియోడర, జి ఆర్ షాలోమ్ కరోలిన. వీరిరువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌గా పనిచేస్తున్నారు. వీరు ప్రస్తుతం రాజమండ్రిలో నివాసముంటున్నారు.*



# సర్వోన్నతుడు సశరీరుడయ్యే

ప్రవక్త యెషయా – ప్రవచించె
కన్యక గర్భవతియై – కుమారుని కనును
తన ప్రజలను – తమ పాపముల నుండి
విడిపించె – విమోచన కర్త
మనకు శిశువు – పుట్టెను –
ఆలోచనకర్త – అరుదెంచె
నిత్యుడగు తండ్రి – నీ కొరకు దిగివచ్చె
దేవునికిని – మానవాళికిని
మధ్యవర్తి – ఒక్కడే
ఆయనే – యేసుక్రీస్తను నరుడు
సృష్టికర్త – శరీరమును ధరించె
ఆదాము దోషమునకు – అడ్డుపడి
రక్తమాంసములను – ధరించె రక్షకుడు
గాబ్రియేలు దూత – గళమెత్తి చాటిన
ఆనవాళ్ళను గురించి – ఆలోచించుడి
ఇదిగో ... ఆనందం
ఇదిగో ... బెత్లెహేము
ఇదిగో ... దావీదు పట్టణం
ఇదిగో ... యెరూషలేము
ఇదిగో ... హోలీల్యాండ్
ఇదిగో ... హోలీ నేషన్
ఇదిగో ... హోలీ బైబిల్
ఇదిగో ... నక్షత్రం

చరిత్రను విభజించిన – చరిత్రకారుడు
క్రీస్తుశకం – 2024
క్యాలెండర్‌యే – ఖచ్చితమైన ఋజువు
ఇశ్రాయేలుకు – మహిమ
అన్యజనులకు – వెలుగు
సుమియోను యొక్క – సునాదగీతం
సూటిగా – వర్ణించె
మృత్యుభీతి – తొలగించు
ఆత్మశుద్ధి – కలిగించు
బెత్లెహేము నుండి – 'క్రిస్మస్' సవ్వడి
భూదిగంతాల వరకు – వ్యాపించుచుండె
యూదా ప్రజలు –ఎదురు చూచిన 'మెస్సీయ్య
మానవునిగా – మహినుద్భవించే
యూదుల రాజుగా – పుట్టిన వాడెక్కడ?
జ్ఞానులు – జ్ఞానముతో అడిగిన ప్రశ్న ఇదే
శిశువును జూచి – సాగిలపడుటకు
జ్ఞానుల బృందం – అరుదెంచే
శరీరమును ధరించిన – సృష్టికర్తను
తెలుసుకొంటే – తరించున్ నీ బ్రతుకు
ప్రాయశ్చిత్తం – జరిగించుటకు
ప్రభువు – జన్మించె
క్రీస్తును – తెలుసుకొనుటయే
నిజమైన – 'క్రిస్మస్'
సర్వోన్నతమైన స్థలములలో – దేవునికి మహిమ
ఆయనకిష్టులైన ప్రజలకు భూమి మీద సమాధానం
సమాధాన అధిపతి – మనలను తన
సమాధానముతో – నింపును గాక ....

– యస్.సి.హెచ్. ఎలీషా, నర్సరావుపేట

## గమనిక

దేవుని కొరకు రాయాలనే ఆసక్తిగల సీనియర్ విద్యార్థులకు విద్యార్థి జ్వాల ఆహ్వానం పలుకుతుంది. కళాశాలలో మీ అనుభవాలు, ట్రెండ్స్, ఆర్టికల్స్, సాక్ష్యాలు, కవితలు, కార్టూన్స్ మొదలగునవి ప్రతి నెల 10వ తేదీలోపు మా ఇమెయిల్ editorvj@gmail.com కు పంపగలరు. ఈ చక్కటి అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోగలరు.



Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-11-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# మేమూ వస్తాం



ప్రకాశమైన దేవదూతల్లారా!
పరలోక సైన్య సమూహమా...
రెక్కలతో ఎగురుతూ
మీరెక్కడికి బయలుదేరారు?
పశువుల తొట్టిలో పరుండిన బాలుడే
బలవంతుడైన దేవుడని
ఆనవాలు చూపడానికి వెళ్తున్నాం!
ఆనందాన్నిచ్చే వార్తను చెప్పడానికి వెళ్తున్నాం!

మిల మిల మెరిసే నక్షత్రమా!
ఒక్కసారి ఆగు...
నీలి ఆకాశంలో నిలబడకుండా
మింటిని వదిలి
నీ గమనమెక్కడికి?
నన్ను సృష్టించినవాడు
నేలమీదికొచ్చాడని
దారి చూప వెళ్తున్నా!
అన్ని చుక్కల్లో నన్నే ఎన్నుకొన్నాడని
సంబరంతో చక్కగా వెళ్తున్నా!

ఎన్నోసార్లు ఆహారం కూడా మర్చిపోయి
అనంత విశ్వాన్ని పరిశోధించే
తూర్పు దేశ జ్ఞానులారా
మీ పుస్తకాలన్నీ అక్కడే వదిలి
మీ పయనమెక్కడికి?

నింగిలో ఒక తార వెలిసింది
సర్వజ్ఞాని లోక రక్షకుడిగా పుట్టాడని
మాకు రుజువును చూపింది
అందుకే...
విలువైన కానుకలివ్వడానికి వెళ్తున్నాం
వినయంగా ఆయనను మొక్కడానికి వెళ్తున్నాం!

పగలూ రాత్రీ తేడా లేకుండా
మందను కాచే కాపరుల్లారా
పొలంలోనే మందనంతా వదిలి
అంత తొందరగా మీరెక్కడికి?
ఇంత చలిరాత్రి చిమ్మచీకట్లో
పరుగెత్తుతూ మీరెక్కడికి?
పసిబాలుడైన పరమ కాపరిని
పూజించడానికి సంతోషంగా వెళ్తున్నాం
తొలిచూలు ఆయనకివ్వాలని
ఇప్పుడే బెత్లెహేము వెళ్తున్నాం!



ఆగండాగండి...
మా బానిసకట్లను తెంచడానికి
కన్య మరియ సుతునిగా వచ్చిన వానిని
మా మరణశిక్ష భరించడానికి
మహిమ సింహాసనం వదిలి వచ్చిన ప్రభువును
మనసారా పూజించడానికి
మేమూ మీతో వస్తాం
మా హృదయాన్ని ఆయనకు
బహుమానంగా సమర్పించడానికి వస్తాం!

– గొంగటి మేరి జాయ్, ఆదోని